AKSHITHA TV
ప్రతిక్షణం... ప్రజాపక్షం

www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
సంపుటి : 16 సంచిక: 288
శనివారం, సెప్టెంబర్ 26, 2026
aakshithanews | akshithatelugudaily | epaper.aakshitha.com
SIMULTANEOUSLY PUBLISHED FROM NALGONDA | RANGAREDDY | HYDERABAD | KHAMMAM | WARANGAL | MAHABUB NAGAR | KARIMNAGAR | NIZAMABAD | AMARAVATHI
చీఫ్ ఎడిటర్ : ఎం.దాస్ | పేజీలు : 08 | వెల: రూ.5.00

అక్షిత For ADVERTISE HERE !
తక్కువ ఖర్చుతో ... విశాల పబ్లిసిటీ
పుట్టినరోజు, పెళ్లిరోజు శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
కోర్ట్ నోటీసులు
పబ్లిక్ & కంపెనీ నోటీసులు
మొదలగు ప్రకటనలకు....
Contact: 8341 855 444 9000 556 444







# పల్లెలకు పక్కా రోడ్లు

## 18,472 కి.మీ పల్లె రోడ్ల ప్రగతి

- తొలుత 6 వేల కోట్లతో 7,448 కి.మీ రోడ్లు
- హ్యామ్ రోడ్లకు ముహూర్తం
- అక్టోబర్ 25 నుంచి హ్యామ్ హంగామా
- పల్లెలకు మౌలిక వసతులు
- ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టే లక్ష్యం
- కాంట్రాక్టర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష
- ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో 1,366 కి.మీ 445 రోడ్లు
- కాంట్రాక్టర్లకు మంత్రి సీతక్క దిశానిర్దేశం



హన్మకొండ/వరంగల్, అక్షిత బ్యూరో : పల్లెల రోడ్ల ప్రగతికి మోక్షం.పల్లెల ప్రగతికి కీలక భూమికగా ఉండే రహదార్ల అభివృద్ధికి మార్గం సుగమం అయ్యింది. గ్రామీణ తెలంగాణకు మెరుగైన, నాణ్యమైన రహదారి సౌకర్యాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. హ్యామ్ విధానంలో చేపడుతున్న గ్రామీణ రహదారుల అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి, గ్రామీణ ప్రాంతాలకు శాశ్వత మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.హనుమకొండ కలెక్టరేట్‌లో శుక్రవారం ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి సీతక్క అధికారులతో సమీక్షించారు. హ్యామ్ రహదారుల నిర్మాణానికి సంబంధించి అధికారులతో పాటు కాంట్రాక్టర్లతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. హ్యామ్ రహదారుల నిర్మాణానికి సంబంధించిన అగ్రిమెంట్లు ఇప్పటికే పూర్తయ్యాయని, పనుల ప్రారంభానికి అవసరమైన సాంకేతిక ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి తెలిపారు. నిర్మాణ పనులకు ఎదురవుతున్న సమస్యలను అధికారులతో, కాంట్రాక్టర్లతో చర్చించి పరిష్కరించినట్లు చెప్పారు.అక్టోబర్ 25న అన్ని ప్యాకేజీల్లో హ్యామ్ రహదారుల పనులు ప్రారంభించాల్సిందేనని కాంట్రాక్టర్లకు స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు మంత్రి వెల్లడించారు. సీఈ నుంచి ఈఈ స్థాయి వరకు అధికారుల పరిధిలోని హ్యామ్ రహదారుల పనులపై సమీక్షించి, పనులు వేగంగా ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

### 18,472 కి.మీ పల్లె రోడ్ల ప్రగతి

హ్యామ్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో మొత్తం 18,472 కి.మీ మేర గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు.తొలి విడతలో 7,448 కి.మీ మేర రహదారులను అభివృద్ధి చేయనున్నామని, ఇందుకోసం ?6 వేల కోట్లకు పైగా ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. తొలి విడతలో సుమారు 3 వేల గ్రామ పంచాయతీల పరిధిలో 2,145 రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. మొత్తం పనులను 17 సర్కిళ్లు, 17 ప్యాకేజీలుగా విభజించినట్లు మంత్రి

మిగతా 2లో..

# రేవంత్ రెడ్డికి బెస్ట్ అవార్డు

## ఆర్యదాన్ ముహమ్మద్ 2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ " అవార్డు

తిరువనంతపురం, అక్షిత ప్రతినిధి : తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. కేరళకు చెందిన ప్రతిష్ఠాత్మక ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ అందజేస్తున్న 'ఆర్యదాన్ ముహమ్మద్ 2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ " అవార్డు అందుకున్నారు.తెలంగాణలో ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధతతో పాటు రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం ఆయన అమలు చేస్తున్న వినూత్న పథకాలు, దూరదృష్టి గల నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే



ఆర్యదాన్ షౌకత్ ప్రకటించారు.

దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ 4వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అవార్డును స్వీకరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్ స్మారకోపన్యాసం చేశారు. రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను రేవంత్ రెడ్డికి అందజేయనున్నారు.ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ మంత్రి ఏ.పి. అనిల్ కుమార్, ప్రముఖ మేధావి కల్‌పెట్ట నారాయణన్‌లతో కూడిన జ్యూరీ రేవంత్ రెడ్డిని ఈ అవార్డుకు ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. కేరళ రాజకీయాల్లో ఆర్యదాన్ ముహమ్మద్ సీనియర్ నేతగా, 8 సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. కార్మికులు, ప్రజా సంక్షేమం, లౌకికవాద విలువలకు ఆయన ప్రతీకగా నిలిచారు.

# జ్ఞానేశ్ కుమార్ దేశానికి అతిపెద్ద ద్రోహి

- రాజీనామా చేయాలి లేకుంటే ఆందోళన
- గాంధీ జయంతిన ప్రతిజ్ఞ



న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. శనివారం లోగా ఆయన రాజీనామా చేయకపోతే గాంధీ జయంతి అయిన అక్టోబర్ 2 నుంచి దేశవ్యాప్త నిరసనలు చేపడతామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. జ్ఞానేశ్ కుమార్ తప్పుకోకపోతే తమ ఆందోళనను దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు విస్తరింపజేస్తామని స్పష్టం చేశారు.అభిజీత్ దీప్కే 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "రేపటిలోగా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకపోతే, సీజేపీ తన దేశవ్యాప్త నిరసనను అక్టోబర్ 2న ముంబైలో ప్రారంభించి, భారతదేశంలోని ఇతర నగరాలకు కూడా తీసుకువెళుతుంది. ఈ గాంధీ జయంతి నాడు ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ప్రతిజ్ఞ చేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.అంతకుముందు గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో దీప్కే మాట్లాడుతూ.. జ్ఞానేశ్ కుమార్‌ను ఈ దేశానికి అతిపెద్ద ద్రోహిగా, దేశ వ్యతిరేకిగా అభివర్ణించారు. "ఎన్నికల సంఘంపై వచ్చిన ఒక నివేదిక ప్రకారం జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారు. మన దేశంలో ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడమే ప్రజాస్వామ్యం. కానీ, జ్ఞానేశ్ కుమార్ సీఈసీ అయినప్పటి నుంచి, ఎవరు ఓటు వేయాలో, ఎవరు వేయకూడదో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ఇది ప్రజాస్వామ్యం కాదు, నిరంకుశత్వం. దీనికి ప్రధాన కారకుడు జ్ఞానేశ్ కుమార" అని దీప్కే తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన 48 గంటల్లో

మిగతా 2లో..

# గంగమ్మ ఒడికి గణనాధుడు

- శోభాయమానంగా మహా గణేష్ శోభాయాత్ర
- అత్యంత భద్రత నడుమ శోభాయాత్ర



హైదరాబాద్, అక్షిత ప్రతినిధి : ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జనం విజయవంతంగా పూర్తయింది. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తులో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా దర్శనమిచ్చిన స్వామి గంగమ్మ ఒడికి చేరాడు. ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సాయంతో నిమజ్జన ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. హుస్సేన్‌సాగర్ వద్దకు చేరుకుని భక్తులు బైబై గణేశా అంటూ నినాదాలు చేస్తుంటే గంగమ్మ ఒడికి చేరాడు.శుక్రవారం ఉదయం ఖైరతాబాద్ గణేష్ శోభాయాత్ర ఆలస్యంగా ప్రారంభమైనా నిమజ్జనం మాత్రం కాస్త వేగంగా జరిగిందని చెప్పవచ్చు. ఉదయం 6 గంటలకు శోభాయాత్ర ప్రారంభ కావాల్సి ఉండగా, బాహుబలి క్రేన్ పైపులలో టెక్నికల్ ప్రాబ్లం కారణంగా దాదాపు మూడు గంటలు లేటయింది. ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి బడా గణేశుడి

మిగతా 2లో..



# రూ.39 లక్షలు పలికిన బాలాపూర్ లడ్డూ

- దక్కించుకున్న సామ ప్రణీత్ రెడ్డి

హైదరాబాద్, అక్షిత ప్రతినిధి: ఆర్బన్ రియాలిటీ గ్రూప్స్ కు చెందిన 35 ఏళ్ల వ్యాపారవేత్త సామ ప్రణీత్ రెడ్డి, రికార్డు స్థాయిలో రూ. 39,00,000/- (నలభై లక్షల రూపాయలు) వేలంలో వేసి పవిత్రమైన బాలాపూర్ గణేష్ లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు. హైదరాబాద్లోని వనస్థలిపురానికి చెందిన సామ ప్రణీత్ రెడ్డి, ఇటీవల అమెరికా నుండి తిరిగి వచ్చి 'ఆర్బన్ గ్రూప్ పేరుతో తన వ్యాపారాన్ని ప్రారంభించారు.

శుక్రవారం ఉదయం బాలాపూర్ గణేష్ చివరి పూజా కార్యక్రమం అనంతరం క్రేన్ సహాయంతో బాలాపూర్ గణేషుడ్ని మినీ ట్రక్కుపైకి ఎక్కించి ఉదయం 7గంటలకు గ్రామ ప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం 9:00 గంటలకు ప్రదక్షిణ పూర్తి చేసుకుని.. బాలాపూర్ గ్రామ బొడ్రాయి దగ్గరకు గణేష్ విగ్రహాన్ని తీసుకువచ్చారు. . ఉదయం 9:30 గంటలకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన బాలాపూర్ గణేష్ లడ్డూ వేలం పాట కార్యక్రమం ప్రారంభమయింది. లడ్డూ వేలం తర్వాత హుస్సేన్ సాగర్కు బాలాపూర్ గణేష్ ను తరలించారు. 18 కిలోమీటర్ల పాటు బాలాపూర్ గణేష్ శోభాయత్ర కొనసాగింది. . ఖైరతాబాద్ గణేశుడి తర్వాత భాగ్యనగరంలో అందరి దృష్టినీ ఆకర్షించేది బాలాపూర్

మిగతా 2లో..

# గోదావరి పారే జలాశయాలు ఎండే

- గోదావరి మళ్ళించి రిజర్వాయర్లు నింపండి
- మోటార్లు నడిపి జలాశయాలను నింపాలి
- గోదావరిలో వరద పోతుంటే.. బురద రాజకీయాలేనా?
- నీళ్లు లేక సిద్దిపేటలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నడవని పరిస్థితి
- మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ



హైదరాబాద్, అక్షిత ప్రతినిధి: గోదావరి జలాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో కేసీఆర్ గారు కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవస్థను నిర్మించారు. ఇందులో భాగంగా 141 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లను ఏర్పాటు చేశారు. గోదావరిలో వరద వచ్చినప్పుడు ఆ నీటిని ఒడిసిపట్టి రిజర్వాయర్లను నింపితే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు.. మరోవైపు గోదావరిలో భారీ వరద ప్రవాహం ఉన్నా, ఆ నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపడంలో వి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఆందోళన కలిగిస్తోంది. నీళ్లు అందక పంటలు ఎండిపోతుంటే విరు మాత్రం ప్రాజెక్టుల విద రాజకీయాలు చేస్తూ పంటలు ఎండగొడుతున్నారు. గోదావరి జలాలను లిఫ్ట్ చేయకుండా చోద్యం చూస్తున్నారు. ఒకవైపు గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతుంటే, మరోవైపు అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజీలో ఉన్నాయి.

మిగతా 2లో..

# అరికెపూడికి ఈడి ఉచ్చు!

- రూ.2.1 కోట్ల బదిలీపై ఈడి ఆరా !!
- సాహితీ కేసులో అరికెపూడికి చిక్కులు



శేరిలింగంపల్లి, అక్షిత ప్రతినిధి : సాహితీ ఇన్‌ఫ్రా మనీలాండరింగ్ దర్యాప్తులో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. రూ.2.1 కోట్ల నగదు లావాదేవీలపై వివరణ తీసుకునేందుకు ఈ నెల 27న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో ఈడీ అధికారులు పేర్కొన్నారు. సాహితీ ఇన్‌ఫ్రా ఖాతాల నుంచి గాంధీకి సుమారు రూ.2.1 కోట్ల మేర బదిలీ అయినట్లు అధికారులు గుర్తించినట్టు సమాచారం.తెలంగాణ పోలీసుల ఎఫ్ఐఆర్‌ను ఆధారంగా చేసుకుని మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. సంస్థపై ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో కొనుగోలుదారుల నుంచి నిధులు సేకరించి, వాటిని దారి మళ్లించారనే ఆరోపణలపై ఇప్పటికే విచారణ జరుగుతోంది. ఈ కేసులో సంస్థకు, సంబంధిత వ్యక్తులకు చెందిన ఆస్తులపై గతంలో ఈడీ చర్యలు తీసుకుంది. రూ.161 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేశారు. సాహితీ ఇన్‌ఫ్రాటెక్ ఎండీ బూడాటి లక్ష్మీనారాయణను 2024లో అరెస్ట్ చేశారు.

**సాహితీ సంస్థ కార్యకలాపాలతో తమకు సంబంధం లేదు**

ఆఫీస్ స్థలానికి రూ.2018లో రూ.2.1 కోట్లు చెల్లించా.స్థలమివ్వలే. తిరిగి డబ్బు తిరిగొచ్చింది. అంతే తప్ప సాహితీ సంస్థ లావాదేవీలతో తమకు ఎలాంటి సంబంధం లేదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ చెప్పారు. సాహితీ సంస్థ నుంచి రూ.2.1 కోట్లు తమ ఖాతాలోకి

మిగతా 2లో..




# జవాన్లకు మౌలిక సౌకర్యాలు కల్పన

- నక్సలైట్లు, దేశ వ్యతిరేకశక్తుల పీచమణచడంతో బీఎస్ఎఫ్ కీలక పాత్ర
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- చెన్నై బీఎస్ఎఫ్ హెడ్ క్వార్టర్స్ లో నూతన భవనాలను ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

చెన్నై, అక్షిత ప్రతినిధి : దేశ రక్షణలో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) అగ్రభాగాన నిలుస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. నక్సలైట్లు, దేశ వ్యతిరేక శక్తుల పీచమణచడంలో బీఎస్ఎఫ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. బీఎస్ఎఫ్ సిబ్బంది రక్షణ కవచంలా నిలవడంవల్లే మల్కాన్‌గిరి ప్రాంతం శాంతి, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందనక్నారు.

చెన్నైలోని బీఎస్ఎఫ్ సెక్టార్ హెడ్‌క్వార్టర్స్ లో నూతనంగా నిర్మించిన పరిపాలనా, నివాస సౌకర్యాల భవనాలను ప్రారంభించారు. రూ.11.07 కోట్లతో నిర్మించిన అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ను, రూ. 4.74 కోట్ల వ్యయంతో నిర్మించిన గెటిజెట్ ఆఫీసనర్స్ భవనాన్ని. రూ.9.86 కోట్ల వ్యయంతో నిర్మించిన సిబ్బంది బ్యారక్‌ను, రూ.5.30 కోట్ల వ్యయంతో నిర్మించిన సబార్డినేట్ అధికారుల భవనాన్ని ప్రారంభించారు. బీఎస్ఎఫ్ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఏర్పాటు

మిగతా 2లో..

# జ్ఞానేశ్ కుమార్ దేశానికి అతిపెద్ద ద్రోహి

(మొదటి పేజీ తరువాయి)

పదవి నుంచి దిగిపోవాలని అల్టిమేటం జారీ చేశారు. ఎస్ఐఆర్, ఓటర్ డేటా యాక్సెస్, కొత్త ఓటర్ల నమోదు వంటి కీలక అంశాలపై ఎన్నికల సంఘంలోనే విభేదాలు తలెత్తాయని వస్తున్న వార్తల నేపథ్యంలో సీజేపీ ఈ ఆరోపణలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదే సమావేశంలో పార్టీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ.. ప్రస్తుత వ్యవస్థ దేశాన్ని ఒక పెద్ద ప్రహసనంగా మార్చేసిందని విమర్శించారు. “ఈ వ్యవస్థ అవినీతిమయమైంది, విఫలమైంది. దేశంలోని యువత మార్పును కోరుకుంటోంది. ప్రాథమిక మార్పులు అవసరమని వారు డిమాండ్ చేస్తున్నారు” అని ఆయన వ్యాఖ్యానించారు

# గంగమ్మ ఒడికి గణనాధుడు

(మొదటి పేజీ తరువాయి)

శోభాయాత్ర కనులపండువగా ప్రారంభమైంది. సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్ నుంచి ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్ వరకు ఈ ఖైరతాబాద్ గణేషుడి శోభాయాత్ర సాగింది. .ఈ ఏడాది ‘పంచముఖ సంకటహర మహా గణపతి’గా దర్శనమిచ్చిన 69 అడుగుల భారీ విగ్రహాన్ని గురువారం రాత్రి దర్శనాలు ముగిసిన అనంతరం ప్రత్యేక భారీ రవాణా వాహనం (ట్రాన్స్‌పోర్టర్)పైకి చేర్చారు. వెల్డింగ్ పనులు, ఇతర తుది ఏర్పాట్ల కారణంగా ఉదయం 6 గంటలకు బదులుగా కాస్త ఆలస్యంగా శోభాయాత్ర మొదలైంది. మధ్యాహ్నం 2 గంటల కల్లా హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఖైరతాబాద్ మండపం నుంచి బయలు దేరిన ఈ యాత్ర రాజీవ్ గాంధీ విగ్రహం, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మీనార్, తెలుగు తల్లి జంక్షన్, సచివాలయం మీదుగా ట్యాంక్ బండ్‌కు చేరుకుంది. ఈ యాత్ర సందర్భంగా పోలీసులు నగరం అంతటా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. వేలాది మంది సిబ్బంది, ప్రత్యేక బృందాలను మోహరించి, ఊరేగింపు సాఫీగా సాగేలా పర్యవేక్షిస్తున్నారు. పర్యావరణ హితంగా మట్టితో రూపొందించిన ఈ విగ్రహాన్ని పది రోజుల పాటు 25 లక్షల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలందరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# జవాన్లకు మౌలిక సౌకర్యాలు కల్పన

(మొదటి పేజీ తరువాయి)

చేసిన కార్యక్రమంలో బీఎస్ఎఫ్ అదనపు డైరెక్టర్ జనరల్ , సెవాంగ్ నాంగ్యాల్, ప్రత్యేక డైరెక్టర్ జనరల్ ఇంజనీర్ వివేక్ నంద్ వివేక్, చీఫ్ ఇంజనీర్ (దక్షిణ ప్రాంతం), చెన్నై ఎ. శ్రీనివాస రావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఫ్రంటియర్ హెడ్‌క్వార్టర్స్,(ఒడిశా) సి. హెచ్. సేతురామ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్, సెక్టర్ హెడ్‌క్వార్టర్స్, ( చెన్నై) విజయ్ సిన్హా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.ఎస్. రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జవాన్లను ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడుతూ..2014లో బీఎస్ఎఫ్ చెన్నై--మల్కాన్‌గిరి సెక్టర్ ఏర్పడినప్పటి నుంచి నక్సలైట్లు, దేశ వ్యతిరేక శక్తులకు వ్యతిరేకంగా మన రక్షణ వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగంగా పనిచేస్తోంది. ఈ సెక్టర్ సిబ్బంది చూపిస్తున్న ధైర్యం, అప్రమత్తత మరియు అంకితభావం బీఎస్ఎఫ్ నినాదమైన “జీవితాంతం కర్తవ్యం” అనే మాటలకు నిజమైన అర్థాన్ని చూపిస్తున్నాయి. ఈ రోజు మల్కాన్‌గిరి శాంతి, అభివృద్ధికి కొత్త యుగంలోకి అడుగుపెట్టింది. మౌలిక సదుపాయాల రంగంలో కూడా అక్కడ నిరంతర అభివృద్ధి జరుగుతోంది. ఇది మీలాంటి వీర జవాన్లు ఒక అభేద్యమైన రక్షణ గోడలా నిలబడి దేశాన్ని కాపాడటం వల్లే సాధ్యమైంది.

దేశానికి రక్షణ కల్పించడంలో బీఎస్ఎఫ్ అగ్రభాగాన నిలిచింది. దేశ సరిహద్దులను రాత్రింబవళ్లు కాపాడేందుకు బీఎస్ఎఫ్ సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. దేశాన్ని కాపాడే మన జవాన్లు కూడా సురక్షితంగా ఉండేందుకు వారికి అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పం.

ఈరోజు ప్రారంభించిన ఈ ఆధునిక బ్యారక్ కేవలం ఒక భవనం మాత్రమే కాదు. ప్రతికూల పరిస్థితుల్లో, మైనస్ ఉష్ణోగ్రతల్లో, ఎన్నో సవాళ్ల మధ్య కూడా దేశ సరిహద్దులను కాపాడుతున్న వీర సిబ్బంది, జవాన్ల పట్ల మన గౌరవానికి ఇది ఒక ప్రతీక. ఈ కొత్త ప్రాంగణంలో జవాన్లకు విశ్రాంతి, పరిశుభ్రత, రోజువారీ అవసరాలకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించాం. డ్యూటీ పూర్తయిన తర్వాత మన జవాన్లకు మానసికంగా, శారీరకంగా విశ్రాంతి తీసుకుని మళ్లీ ఉత్సాహంగా, అంకితభావంతో మరియు ఉన్నతమైన మనోధైర్యంతో విధులు నిర్వహించేలా మంచి వాతావరణాన్ని కల్పించడం మన లక్ష్యం. దక్షిణ భారతదేశంలో విధులు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, పిల్లలు, భవిష్యత్తులో చెన్నై సెక్టర్ ద్వారా వివిధ సంక్షేమ సౌకర్యాలు, పరిపాలనా సహాయం, వైద్య సేవలు మరియు విద్యా సౌకర్యాలను పొందగలరు. అందరం కలిసి బలమైన, సురక్షితమైన అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రూ.39 లక్షలు పలికిన బాలాపూర్ లడ్డూ

(మొదటి పేజీ తరువాయి)

గణేశుడి లడ్డూ వేలం పాట. ఇక్కడి లంబోదరుడి చేతిలో ఉండే లడ్డూ వేలం పాటతో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుంటోంది. లడ్డూను ఎవరు దక్కించుకుంటే వారింట సిరిసంపదలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందుకే గణేశుడి లడ్డూ వేలం పాట కోసం సర్వత్రా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. గతంలో లడ్డూ దక్కించుకున్న 32 మందితో పాటు ఈసారి కొత్తగా 8 మంది భక్తులు వేలంలో పాల్గొన్నారు.

# గోదావరి పారే జలాశయాలు ఎండే

(మొదటి పేజీ తరువాయి)

మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 13 టీఎంసీలు మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తుంది. ఇక్కడ 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం అందుబాటులో ఉంది. మల్లన్న సాగర్ నిండుకుండలా మారితే హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు, విరు చెబుతున్న మసీ ప్రాజెక్టుకు కూడా ఇక్కడి నుంచి నీటిని తరలించే అవకాశం ఉంటుంది. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌లోనూ 15 టీఎంసీలకు కేవలం 6 టీఎంసీలే ఉన్నాయి. ఇక్కడికి సైతం నీటిని ఎత్తిపోస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకు ప్రయోజనం చేకూరుతుంది.

ఎల్లంపల్లిలో నీటి ఎత్తిపోతలు ప్రారంభిస్తే మిడ్ మానేరు సహా అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లకు నీటిని తరలించడంతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా పూర్తి పరిష్కారం లభిస్తుంది. ఈ రిజర్వాయర్లను నింపడం వల్ల దాదాపు 5 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి దోహదం చేసినట్లవుతుంది. మరోవైపు మిడ్ మానేరు దిగువన ఉన్న లోయర్ మానేరు డ్యాం (ఎల్.ఎం.డి.)లో ప్రస్తుతం 11 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఇక్కడికి నీటిని తరలిస్తే కరీంనగర్, వరంగల్ జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయి. పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాల్లోని రైతులు, ప్రజలకు ఎంతో మేలు చేసిన వారవుతారు.

అయితే రంగనాయక సాగర్‌లో నీళ్లు లేకపోవడం వల్ల పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితితో పామ్ ఆయిల్ సాగు చేస్తున్న రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి కోసం రైతులు కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తుంటే, విరు మాత్రం నదుల్లో వస్తున్న నీళ్లను లిఫ్ట్ చేయకుండా కిందకు వదిలిపెడుతున్నారు. ప్రస్తుతం గోదావరి నదిలో ఎల్లంపల్లి వద్ద వరద ప్రవాహం భారీగా కొనసాగుతున్నది. ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకొని అన్ని మోటార్లను నడిపి నీళ్ళు లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నా వి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఉద్దేశపూర్వకంగా విరు చేస్తున్న నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతున్నది. జలకళతో కనిపించాల్సిన రిజర్వాయర్లు ఎండిపోయి కనిపిస్తున్నాయంటే దానికి కారణం నీటి నిర్వహణలో వి ప్రభుత్వ వైఫల్యం. ఇప్పటికైనా కళ్లు తెరవండి. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం లేదు మంత్రిగారు. ఎల్‌నినోను సాకుగా చూపకుండా, అందివచ్చిన గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా ఆన్-ఆఫ్ పద్ధతిలో కాకుండా 24 గంటల పాటు అన్ని మోటార్లు నడిపి జలాశయాలను నింపాలని డిమాండ్ చేస్తున్నాం. రాజకీయాలను పక్కన పెట్టి రైతు ప్రయోజనాల కోసం ఆలోచించాలని, ప్రకృతిపై నెపం నెట్టి రైతులకు సాగు నీళ్లు ఇచ్చే బాధ్యత నుంచి తప్పించుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం..

# పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలే

**ప్రతి పేదింటికి సన్న బియ్యం**

**27, 28న హుజూర్‌నగర్, మిర్యాలగూడ, సూర్యాపేటలో మంత్రి ఉత్తమ్ విస్తృత పర్యటన**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి:** రాష్ట్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న గత ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు చేయకుండా పేద, మధ్యతరగతి కుటుంబాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కొత్తగా కుటుంబాలు ఏర్పడినప్పటికీ, కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగినప్పటికీ, లక్షలాది మంది అర్హులు దరఖాస్తులు చేసుకున్న గత ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోలేదన్నారు.

ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సిఎం ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆహార భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తాను పౌర సరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా చేపట్టామన్నారు. 2025 జనవరి 1 నాటికి రాష్ట్రంలో 89,95,282 రేషన్ కార్డులు ఉండగా, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 16,32,810 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేశామని తెలిపారు. కొత్త కార్డుల ద్వారా మరో 61,09,544 మందికి ఆహార భద్రత కల్పించామని పేర్కొన్నారు. పాత, కొత్త కార్డులు కలిపి ప్రస్తుతం తెలంగాణలో మొత్తం 1,06,28,092 రేషన్ కార్డులు ఉన్నాయని, వీటి ద్వారా 3,42,57,109 మంది ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ ఆహార భద్రత కల్పించే స్థాయిలో తమ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రేషన్ కార్డు అనేది కేవలం బియ్యం పొందడానికి ఉపయోగపడే పత్రం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు ఆహార భద్రతతోపాటు అనేక సంక్షేమ పథకాలను అందించే కీలకమైన ఆధారమని చెప్పారు. ప్రతి అర్హ కుటుంబానికీ రేషన్ కార్డు అందించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు.

రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులందరికీ ప్రతి వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. పేద ప్రజలు కూడా గౌరవంగా నాణ్యమైన బియ్యం తినాలన్న ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

భారీ సంక్షేమ కార్యక్రమంలో భాగంగానే తన సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌తోపాటు, పొరుగున ఉన్న మిర్యాలగూడ నియోజకవర్గంలోనూ లబ్ధిదారులకు రేషన్ కార్డులను స్వయంగా పంపిణీ చేయనున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

సెప్టెంబర్ 27 ఉదయం మంత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరి నేరేడుచర్లకు చేరుకుంటారు. అక్కడ పాలకీడు, నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తారు. అనంతరం పాలకీడు మండలం ముసిఒడ్డు సింగారం గ్రామంలో రూ. 1.80 కోట్లతో నిర్మించిన ముసిఒడ్డు సింగారం--రోళ్లవారిగూడెం బీటీ రోడ్డును ప్రారంభిస్తారు.

హుజూర్‌నగర్ పట్టణంలో జరిగే కార్యక్రమంలో హుజూర్‌నగర్ పట్టణం, మండలం, మఠంపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తారు. అనారోగ్యం, ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ ఎంతో భరోసాగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు.

తదుపరి మేళ్లచెరువు మండలం కందిబండ గ్రామంలో రూ. 2.80 కోట్లతో నిర్మించిన వంతెనను ప్రారంభిస్తారు. కప్పలకుంట తండాలో రూ. 30 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలు, వెల్లటూరు ఆర్ అండ్ ఆర్ కాలనీలో రూ. 10 లక్షలతో, వేపల మాధవరంలో రూ. 10 లక్షలతో నిర్మించిన విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలను ప్రారంభిస్తారు.

మేళ్లచెరువులో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువపై రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మించిన మూడు వంతెనలను మంత్రి ప్రారంభిస్తారు. అనంతరం మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తారు. చింతలపాలెం మండలం కొత్తగూడెం, గాంధీనగర్ తండాల్లో ఒక్కొక్కటి రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభిస్తారు.

సెప్టెంబర్ 28 గరిడేపల్లి మండలం కొండాయిగూడెంలో రూ. 10 లక్షలతో నిర్మించిన మహిళా స్వయం సహాయక సంఘం భవనాన్ని, రెగ్యులగడ్డ తండాలో రూ. 30 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ, స్వయం సహాయక సంఘం భవనాలను మంత్రి ప్రారంభిస్తారు. అనంతరం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చేరుకుని అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తారు.

రెండు రోజుల పర్యటనలో మొత్తం రూ. 8.90 కోట్ల విలువైన రహదారులు, వంతెనలు, గ్రామ పంచాయతీ, విలేజ్ ఆర్గనైజేషన్, స్వయం సహాయక సంఘాల భవనాలను మంత్రి ప్రారంభించనున్నారు. గ్రామీణ రహదారులు, రవాణా సౌకర్యాలు, మహిళా సంఘాల మౌలిక వసతులు, గ్రామ పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ఈ అభివృద్ధి పనుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

మిర్యాలగూడ కార్యక్రమం అనంతరం మంత్రి సూర్యాపేటకు చేరుకుని భారత ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహార శైలికి వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమంలో పాల్గొంటారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉండాలంటే ఎన్నికల సంఘం పూర్తి నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉందని, ప్రజల ఓటు హక్కును, ఎన్నికల ప్రక్రియ పవిత్రతను కాపాడటం ప్రతి ప్రజాస్వామ్యవాది బాధ్యతని ఆయన పేర్కొన్నారు.

రాజ్యాంగ సంస్థలు అధికార పార్టీలకు అనుకూలంగా కాకుండా దేశ ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ఓటు హక్కును రక్షించేందుకు చేపట్టే పోరాటంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గౌరవంగా నాణ్యమైన బియ్యం తినాలన్న ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం కార్యక్రమాన్ని అమలు చేస్తోం దన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. భారీ సంక్షేమ కార్యక్రమంలో భాగంగానే తన సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌తోపాటు, పొరుగున ఉన్న మిర్యాలగూడ నియోజక వర్గంలోనూ లబ్ధిదారులకు రేషన్ కార్డులను స్వయంగా పంపిణీ చేయనున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# పెన్షన్ కోసం వాహనాల బదలాయింపులా..?

- **నిజామాబాద్ రవాణా కార్యాలయంలో వాహన యాజమాన్య మార్పులపై అనుమానాలు...**
- **రికార్డులపై సమగ్ర విచారణకు డిమాండ్...**

**నిజామాబాద్,అక్షిత బ్యూరో:** ప్రభుత్వ పెన్షన్ పథకాలకు అర్హత సాధించేందుకు కొందరు తమ నాలుగు చక్రాల వాహనాలను ఇతరుల పేర్లకు బదలాయిస్తున్నారనే ఆరోపణలు నిజామాబాద్ జిల్లాలో తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, బంధువుల పేర్లకు వాహనాలను మార్చుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**వాహనం పేరు మారితే వాస్తవ యాజమాన్యం మారినట్టేనా?**

పెన్షన్ అర్హతను తప్పించుకునే ఉద్దేశంతో వాహనాన్ని కేవలం కాగితాలపై మరొకరి పేరుకు మార్చి, వాస్తవంగా అదే కుటుంబం వినియోగిస్తే.. అది అర్హత పరిశీలనలో ఎలా పరిగణిస్తారు? యాజమాన్య బదలాయింపుకు సంబంధించిన పత్రాలను అధికారులు ఏ విధంగా పరిశీలిస్తున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**వాహనం బదలాయింపు నిజమైన విక్రయమా?**

లేక కేవలం పేరు మార్పేనా?

బదలాయింపు చేసిన వ్యక్తి వాహనాన్ని వాస్తవంగా అప్పగించాడా?

పెన్షన్ అర్హత కోసం ఉద్దేశపూర్వకంగా యాజమాన్య మార్పు జరిగిందా?

ఈ ప్రశ్నలకు రవాణా శాఖతో పాటు సంబంధిత పెన్షన్ పరిశీలన అధికారులు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**మూడు నెలల రికార్డులు బయటపెట్టాలి**

జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నిజామాబాద్ రవాణా కార్యాలయ పరిధిలో ఎన్ని నాలుగు చక్రాల వాహనాల యాజమాన్య బదలాయింపులు జరిగాయి? గత ఏడాది ఇదే కాలంలో ఎన్ని జరిగాయి? ప్రభుత్వ ఉద్యోగులు లేదా ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల పేర్లకు ఎన్ని వాహనాలు బదలాయించబడ్డాయి? అనే వివరాలను అధికారులు వెల్లడించాలి.

**రికార్డుల్లో అసాధారణ పెరుగుదల కనిపిస్తే....**

సంబంధిత బదలాయింపులపై నిబంధనల ప్రకారం సమగ్ర పరిశీలన జరపాల్సిన అవసరం ఉంది.

**పెన్షన్ కోసం అక్రమ మార్గాలకు అడ్డుకట్ట ఎక్కడ?**

ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు చేరాలంటే అర్హత నిబంధనలను ఉల్లంఘించే ప్రయత్నాలను అడ్డుకోవడం అత్యంత కీలకం. వాహనం పేరు మార్చడం ద్వారా వాస్తవ పరిస్థితిని దాచిపెట్టి పెన్షన్ పొందే ప్రయత్నం జరిగితే, అది ప్రభుత్వ నిబంధనల ఉద్దేశాన్ని దెబ్బతీసే చర్యగా మారే అవకాశం ఉంది.







అందువల్ల నిజామాబాద్ జిల్లా కలెక్టర్, రవాణా శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత పెన్షన్ అధికారులు వాహన బదలాయింపుల రికార్డులను పరస్పరం పరిశీలించి వాస్తవ పరిస్థితిని వెలుగులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

**అధికారుల ముందున్న ప్రశ్నలు ఇవే!**

నిజామాబాద్ రవాణా కార్యాలయంలో గత మూడు నెలల్లో ఎన్ని నాలుగు చక్రాల వాహనాల బదలాయింపులు జరిగాయి?

వాటిలో ప్రభుత్వ ఉద్యోగులు లేదా ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల పేర్లకు ఎన్ని బదలాయింపులు జరిగాయి?

**పెన్షన్ అర్హతను తప్పించుకునేందుకు వాహనాల పేరు మార్పుపై ఫిర్యాదులు వచ్చాయా?**

వచ్చి ఉంటే ఇప్పటివరకు ఎలాంటి విచారణ జరిగింది?

వాహనం పేరు మారినా వాస్తవ వినియోగదారుడు మారలేదని తేలితే పెన్షన్ అర్హతను అధికారులు ఎలా నిర్ణయిస్తారు?

ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి. రికార్డులు ఏమి చెబుతున్నాయి? వాహన బదలాయింపుల వెనుక అసలు కారణం ఏమిటి? అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

# పల్లెలకు పక్కా రోడ్లు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. హ్యామ్ విధానంలో రహదారుల నిర్మాణంతో పాటు వాటి నిర్వహణకు కూడా ప్రాధాన్యత ఉంటుందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం చెల్లింపులు ప్రస్తుత దశలో, మిగిలిన 60 శాతం నిధులను వచ్చే 15 ఏళ్లలో చెల్లించే విధానం అమలు చేస్తున్నట్లు చెప్పారు.

దీంతో రహదారుల నిర్వహణకు దీర్ఘకాలిక బాధ్యత ఉంటుందని, 15 ఏళ్ల కాలంలో రహదారులు నాణ్యతతో నిర్వహించబడేలా వ్యవస్థ ఉంటుందని తెలిపారు. రహదారుల నాణ్యతకు కాంట్రాక్టర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

**ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో 445 రహదారులు**

ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో 445 హ్యామ్ రహదారులను, 1,366 కి.మీ మేర అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం సుమారు ?1,130 కోట్ల వరకు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో 90 శాతం మేర ఇప్పటికే ఉన్న రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు, 10 శాతం మేర కొత్త రహదారులను నిర్మించనున్నట్లు తెలిపారు.

ప్రతి ఆవాసం నుంచి గ్రామపంచాయతీకి, అక్కడి నుంచి మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి, రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి సౌకర్యం ఉండాలన్న ముఖ్యమంత్రి ఆలోచనకు అనుగుణంగా హ్యామ్ విధానంలో రహదారుల అభివృద్ధి చేపడుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అసెంబ్లీలో ప్రత్యేకంగా చర్చించి తీర్మానం చేసినట్లు మంత్రి తెలిపారు. దానికి అనుగుణంగా ప్రతి గ్రామంలో ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రిజర్వాయర్లలో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ జాగ్రత్తగా వినియోగిస్తున్నామని, ప్రస్తుతం రాష్ట్రంలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. ప్రతి జలాశయంలో నీటి మట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పరిధిలోని సమస్యాత్మక 86 జనావాసాల్లో తాగునీటి సరఫరాను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ఆదివాసీ, గిరిజన ఆవాసాల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవ రాజన్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ పనిచేస్తుందని వెల్లడించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టే లక్ష్యంతో నాలుగు నెలల క్రితమే జలసిరి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు.







“ప్రతి ఇంటికి ఇంకుడు గుంత.. ప్రతి పొలానికి పంట కుంట.. ప్రతి ఊరికి ఊటకుంట” అనే లక్ష్యంతో నీటి సంరక్షణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఉపాధి కోరిన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నామని, ఇప్పటికే ?2 వేల కోట్లకు పైగా వేతనాలను ఉపాధి కూలీలకు చెల్లించినట్లు తెలిపారు. అక్టోబర్ 2న గ్రామసభల ద్వారా వచ్చే ఏడాదికి సంబంధించిన గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను ప్రజలతో చర్చించి ఆమోదించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు పని కల్పించడంతో పాటు గ్రామాలకు శాశ్వత ఆస్తులను సృష్టించడమే లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడం ద్వారా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. మహిళలు వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నామని, ఇప్పటివరకు ?67 వేల కోట్ల బ్యాంకు రుణాలు అందించినట్లు చెప్పారు.

దీంతో సుమారు 6 లక్షల వరకు కుటీర, చిన్న తరహా వ్యాపారాలను మహిళలు ఏర్పాటు చేసుకోగలిగారని తెలిపారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇందిరమ్మ ఇళ్లను సైతం మహిళల పేరుపైనే మంజూరు చేస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. ఆడబిడ్డ ఇంటికి యజమాని అయినందున వారి గౌరవం పెరుగుతోందని వెల్లడించారు. ఇండ్లలో నుంచి మహిళలను వెళ్ళగొట్టే సంస్కృతి పోయిందని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల స్పెషల్ సీఎస్ దాన కిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ కలెక్టర్ సత్య శారద స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, అడిషనల్ కమిషనర్ రవీందర్, మిషన్ భగీరథ ఈఎన్ సీ కృపాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఈఎన్ సీ జగదీశ్వర్, అడిషనల్ కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



# ఆహారంలో చిరు ధాన్యాలు తప్పనిసరి

**ఐసిడిఎస్ దామరచర్ల ప్రాజెక్టు పరిధిలో 9వ జాతీయ మాసోత్సవాలు**

**వేములపల్లి, అక్షిత న్యూస్:** వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఇటిక్యాల 1 ∝ 2 అంగన్వాడి కేంద్రములలో శుక్రవారం 9వ జాతీయ మాసోత్సవాలలో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ పరిమి రజిని హాజరై మాట్లాడుతూ స్త్రీలు బాలింతలు చిన్నపిల్లల తల్లులకు పోషకాహార ప్రాముఖ్యత అవగాహన కల్పించారు. సూపర్వైజర్ పరిమి రజని మాట్లాడుతూ ప్రతిరోజు తీసుకునే ఆహారంలో తప్పనిసరిగా చిరు ధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు పాలు,పండ్లు భోజనంలో ఊదలు, సామలు , కొర్రలు అరికెలు,పప్పు దినుసులు, పాలకూర, తోటకూర, గోంగూర, మునగాకు, బెల్లం, ఖర్జూర నువ్వులు, పల్లీలు,గుడ్లు చేపలు ఉండేలా తల్లులు పిల్లలు తీసుకోవాలని, జంక్ ఫుడ్స్ తీసుకోకూడదని అవగాహన కల్పించడం జరిగింది. గ్రామంలో బాల్యవివాహాలు అక్రమ దత్తతలు జరగకూడదని అందుకు శిక్షార్హులని తల్లులకు తెలియజేయడం జరిగింది. ప్రతిజ్ఞ చేయించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెదపంగ సైదులు హైస్కూల్ హెచ్ఎం నీలం సత్యనారాయణ, ప్రైమరీ స్కూల్ టీచర్ పెదమాం ఝాన్సీ, పంచాయతీ సెక్రెటరీ నవీన్ రెడ్డి, అంగన్వాడీ టీచర్స్ యాదమ్మ, సుభద్ర,విమల, ఆశ వర్కర్ నాగమ్మ, రేణుక, ఆయా జలేంద్ర తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

# అరికెపూడికి ఈడి ఉచ్చు!

(మొదటి పేజీ తరువాయి)

వచ్చినట్లు మీడియాలో జరుగుతున్న ప్రచారంపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వివరణ ఇచ్చారు. ఈడీ నోటీసు అంశంపై మీడియాలో కొందరు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వాస్తవాలను గమనించాలని కోరారు. సాహితీ సంస్థ నుంచి తమకు రూ. 2.1 కోట్లు వచ్చాయని ప్రచారం జరుగుతున్నప్పటికీ.. వాస్తవానికి ఆ మొత్తాన్ని తాము 2018లోనే కార్యాలయ స్థలం కోసం సదరు సంస్థకు తమ ఖాతా ద్వారా చెల్లించినట్లు గాంధీ తెలిపారు. అయితే కార్యాలయ స్థలాన్ని కేటాయించలేకపోవడంతో సదరు సంస్థ ఆ మొత్తాన్ని తిరిగి తమ ఖాతాలోకి జమ చేసిందని వివరించారు. ఈ లావాదేవీకి సంబంధించిన వాస్తవాలను మీడియా దృష్టికి తీసుకు వస్తున్నామని పేర్కొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY




## రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

**- ఏఈఓ వెంకట్ రెడ్డి**

**నడిగూడెం, అక్షిత న్యూస్:** మండల పరిధిలోని రామాపురం గ్రామంలో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి వెంకట్ రెడ్డి నిర్వహించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వెంకట్ రెడ్డి హాజరై రైతులకు సూచనలు చేశారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడి అనేది ఆధార్ తరహాలో రైతుకు ప్రత్యేక గుర్తింపు నెంబర్ కేటాయిస్తారని తెలిపారు. రైతుల ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోపోతే పీఎం కిసాన్, రైతు భరోసా డబ్బులు జమ కావని, అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రైమ్ వర్క్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ లో రైతులకు యూరియా కట్టలు రావని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ వల్ల రైతులకు అనేక లాభాలు ఉన్నట్లు తెలిపారు. తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, డిజిటల్ క్రాప్ సర్వే వాలంటీర్లు నరసింహారావు,మోహన్‌రెడ్డి,వార్డ్ మెంబర్ భార్గవ్,రైతులు పాల్గొన్నారు.

## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు

**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఎల్లంపేట్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. తొలి తరపు స్వయం సేవక్, భారత్



జన సంఘ్ పూర్వ అధ్యక్షులు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చేసిన సేవలను బీజేపీ నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు జగన్ గౌడ్, ఎల్లంపేట్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, నాయకులు మహేశ్, శ్రీనివాస్ గౌడ్, సుధాకర్, పుష్ప మల్లా రెడ్డి, హరిప్రసాద్ గౌడ్, నాగేష్, అంజయ్య, మున్నా, నాగరాజు, నర్సింహ, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా

**మానవత్వం చాటిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్**

**ప్రమాద బాధితుడి కుటుంబానికి రూ.4 లక్షల సాయం**

**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల గ్రామానికి చెందిన జక్క కుర్వ జమ్ములు కుటుంబానికి మెగా ఇంజనీరింగ్ కంపెనీ ద్వారా రూ.4 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్యాకేజీ-5 పరిధిలోని తీగలపల్లి క్యాంపులో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న జక్క జమ్ములు ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ



సూర్య ప్రతాప్ గౌడ్ మెగా సంస్థ ప్రతినిధులతో మాట్లాడి బాధితుడి వైద్య ఖర్చులను భరించేలా చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా కుటుంబ జీవనోపాధికి అండగా నిలిచేందుకు కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి రూ.4 లక్షల ఆర్థిక సాయం అందేలా కృషి చేశారు. శుక్రవారం జమ్ములు కుటుంబానికి కంపెనీ తరఫున చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జక్క జమ్ములు, ఆయన భార్య లక్ష్మి మాట్లాడుతూ ప్రమాద సమయంలో అండగా నిలిచి సహకరించిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్కలపల్లి సర్పంచ్ మొట్టే కురుమయ్య, వార్డు సభ్యులు మద్దని పద్మ, అగరయ్య, ఓర్సు నాగమ్మ, చిన్న సుల్తాన్, కాంగ్రెస్ నాయకులు బొల్లె ఈశ్వరయ్య, జక్క వెంకటయ్య, బెల్లె మల్లయ్య, మహేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కెనాల్‌లో గల్లంతైన యువకుడి మృతదేహం వెలికితీత

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బందిపల్లి గ్రామానికి చెందిన తాంద్ర రుద్ర అనే యువకుడు మల్కాపూర్ క్రాస్ రోడ్డు వద్ద కెనాల్‌లో వినాయక విగ్రహ నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. కెనాల్‌లో నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో రుద్ర నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు.

యువకుడి ఆచూకీ కోసం అధికారులు, పోలీసులు, స్థానికులు, సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ఎల్‌ఎండీ



లోయర్ మానేరు డ్యామ్ ప్రాంతంలో రుద్ర మృతదేహం లభ్యమైంది.విషయం తెలుసుకున్న కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికితీసే ప్రక్రియను మేయర్ స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. పోలీసులు, స్థానికులు, సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి, తదుపరి చర్యల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ప్రక్రియను వీలైనంత తొందరగా పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్ మృతుడు రుద్ర కుటుంబ సభ్యులను పరామర్శించి, తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చుతూ అధైర్యపడవద్దని, ఈ విషాద సమయంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు. రుద్ర కుటుంబానికి ప్రభుత్వం, అధికారులు అందించాల్సిన సహాయ సహకారాలపై కూడా మేయర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. మేయర్ వెంట డిప్యూటీ మేయర్ వై.సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం తదితరులు ఉన్నారు.

## అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత, దేశభక్తికి నిలువెత్తు రూపం “పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ”

**బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం**

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత, దేశభక్తికి నిలువెత్తు రూపం “పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ” అని బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం కొనియాడారు.భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పార్లమెంట్ కార్యాలయంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ సమాజాభివృద్ధే ధ్యేయంగా దీన్ దయాల్ జీవితం కొనసాగిందన్నారు. భరతమాత ముద్దుబిడ్డ, దేశోద్ధారకుడయిన పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ‘ఏకాత్మ మానవతావాదం’ భావజాలం దేశ రాజకీయాలకు, సమాజానికి



ఎప్పటికీ మార్గదర్శకమన్నారు.

‘అంత్యోదయ’ సిద్ధాంతమే మన మార్గం అని, సమాజంలో అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలనే ధ్యేయంతో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ‘అంత్యోదయ’ సిద్ధాంతం కోసం తన జీవితాన్ని పూర్తిగా అంకితం చేశారని తెలిపారు. పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ నిస్వార్థ రాజకీయాలు, అంకితభావం, దేశభక్తి నేటి తరానికి నిలువెత్తు నిదర్శనమన్నారు.. ప్రతి బీజేపీ కార్యకర్త ఆయన ఆశయాలను, సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగానీ శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి ,గుజ్జ శ్రీనివాస్ , ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆడి చెర్ల రాజు , గుంజేటి శివ కుమార్ , కటకం లోకేష్ , ఊగిలే సుధాకార్, ముత్యాల జగన్ రెడ్డి, జోన్ , మండల అధ్యక్షులు మాడిశెట్టి సంతోష్, పాదశి శివరాజ్, జాడి బాల్ రెడ్డి, అవుధూర్తి శ్రీనివాస్, కుంట తిరుపతి, కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, కర్రే అనిల్ , నాంపల్లి శ్రీనివాస్ , దాసరి రమణారెడ్డి బీజేవైఎం నాయకులు గుర్రం వెంకటేష్ కోలా అశోక్‌లు పాల్గొని దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## వేంకల్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం, వివో భవనం నిర్మాణం

**రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్,**

**పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండలం వేంకల్ మల్లేశ్వరం గ్రామంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పర్యటించి పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ముందుగా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సేవలు, మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రీ-స్కూల్ విద్య వంటి సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, అంగన్వాడీ కేంద్ర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చిన్నారులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ సూచించారు. అంగన్వాడి కేంద్రానికి సొంత భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లకు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి అంగన్వాడి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ప్రతిపాదనలను పంపాలని కలెక్టర్ సందర్భంగా అధికారులకు సూచించారు.

అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న వివో భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల ప్రస్తుత పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు స్లాప్ లేవల్ వరకు పూర్తయిన భవన నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు.

భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉపయోగించే మెటీరియల్ నాణ్యతను పరిశీలించాలని, పనులను పర్యవేక్షిస్తూ నిర్దేశిత ప్రమాణాల మేరకు నిర్మాణం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పనులు



పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ భవనాల నిర్మాణంలో నాణ్యతతో పాటు పనుల వేగానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అనంతరం వేంకల్ గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రీ సర్వే పనుల పురోగతి, ఇప్పటివరకు చేపట్టిన సర్వే వివరాలు, భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా, తప్పులు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారికి అవసరమైన సమాచారం అందిస్తూ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని, ప్రభుత్వ, అటవీ భూములతో పాటు ప్రజల పట్టా భూముల వివరాల నమోదు, హద్దుల నిర్ధారణ తదితర అంశాల్లో



జాగ్రత్తలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని, రీ సర్వే పూర్తయిన అనంతరం భూ రికార్డులు మరింత స్పష్టంగా, కచ్చితంగా ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ, మౌలిక వసతుల పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, జిల్లా సర్వేయర్ గిరిధర్,పెంట్లవెల్లి తాహసిల్దార్, గ్రామ సర్పంచ్, ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## రూ.1.50 కోట్లతో మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ

**పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, ఓపెన్ జిమ్, బతుకమ్మ ఘాట్ ఏర్పాటు**

**పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: అధికారులకు ఆదేశం**

**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** మహబూబ్‌నగర్ పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) నిధులు రూ.1.50 కోట్లతో మినీ ట్యాంక్ బండ్‌పై చేపట్టిన సుందరీకరణ, అభివృద్ధి పనులను ఆయన సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మినీ ట్యాంక్ బండ్‌ను పట్టణవాసులు కుటుంబ సమేతంగా వచ్చి సేదతీరేలా అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్ సౌకర్యార్థం అత్యాధునిక వాకింగ్ ట్రాక్, యువత ఫిట్‌నెస్ కోసం ఓపెన్ జిమ్, ప్రత్యేక సెల్ఫీ పాయింట్, చిన్నారుల వినోదం కోసం ప్రత్యేక చిల్డ్రన్స్ ప్లే ఏరియాను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా మహిళలు ఘనంగా



వేడుకలు జరుపుకునేలా విశాలమైన బతుకమ్మ ఘాట్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా చూసుకోవాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

నిర్దేశిత గడువులోగా పనులను వేగవంతంగా పూర్తి చేసి, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామానుజులు రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అతినారపు గణేష్ బాబు జ్ఞాపకార్థం

**విద్యార్థులకు ఆట వస్తువులు పంపిణీ**

**సింగిల్ విండో చైర్మన్ జంబుల హనుమంత్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** దాత అతినారపు స్వామి మరియు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో లింగాల మండల పరిధిలోని అంబటిపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆట వస్తువులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగిల్ విండో చైర్మన్ జంబుల హనుమంత్ రెడ్డి. పాల్గొని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతినారపు గణేష్ బాబు జ్ఞాపకార్థం వారి యొక్క కుటుంబ సభ్యుల వారికి తోచిన మేరకు విద్యార్థులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తిప్పరాజు మల్లేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధిత జక్క కుర్వ జమ్ములు కుటుంబానికి రూ.4 లక్షల ఆర్థిక సహాయం

**మెగా ఇంజనీరింగ్ కంపెనీ ద్వారా చెక్కు అందజేసిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్**

**నాగర్ కర్నూల్ , అక్షిత ప్రతినిధి:**

పెద్దకొత్తపల్లి మండలంలోని వెన్నచర్ల గ్రామానికి చెందిన జక్క కుర్వ జమ్ములు కుటుంబానికి మెగా ఇంజనీరింగ్ కంపెనీ ద్వారా రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందించారు. పెద్దకొత్తపల్లి మండలం మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్‌లి చొరవతో ఈ సహాయం అందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.పాలమూరు--రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్యాకేజీ-5 పరిధిలోని తీగలపల్లి క్యాంపులో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న సమయంలో జక్క జమ్ములు ప్రమాదానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ మెగా ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి, ప్రమాద బాధితుడి వైద్య ఖర్చులను భరించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. అదేవిధంగా జమ్ములు కుటుంబ జీవనోపాధికి అండగా నిలిచేందుకు కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు. ఈ మేరకు శుక్రవారం జమ్ములు కుటుంబానికి కంపెనీ తరఫున రూ.4 లక్షల చెక్కును అందజేశారు.



ఈ సందర్భంగా జక్క కుర్వ జమ్ములు, ఆయన భార్య లక్ష్మి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన సమయంలో తమకు అండగా నిలిచి వైద్య ఖర్చుల విషయంలో సహకరించడంతో పాటు కుటుంబ జీవనోపాధికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నక్కలపల్లి గ్రామ సర్పంచ్ మొట్టే కురుమయ్య, వార్డు సభ్యులు మద్దని పద్మ, అగరయ్య, ఓర్సు నాగమ్మ, చిన్న సుల్తాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లె ఈశ్వరయ్య, జక్క వెంకటయ్య, బెల్లె మల్లయ్య, మహేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్‌పుర వరసిద్ధి వినాయకుడికి ప్రభుత్వ విప్ యెన్నం ప్రత్యేక పూజలు

**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మహబూబ్‌నగర్ నగరంలోని హనుమాన్‌పురలోని స్థానిక శ్రీశ్రీశ్రీ పవనపుత్ర వీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని ఆయన దర్శించుకుని అర్చనలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు,



తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించి, భక్తులతో కలిసి కూర్చొని ఆయన అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆ విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలతో మహబూబ్‌నగర్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో,



పాడిపంటలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థించి నట్లు తెలిపారు. పట్టణంలో గణేష్ నవరాత్రులు శాంతియుత, ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతు, ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హబ్సిగూడలో గణనాథుడి సేవలో అసెంబ్లీ స్పీకర్..

**భక్తులకు అన్నప్రసాద వితరణ**

**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, సెప్టెంబర్ 25:** హబ్సిగూడ ప్రధాన రహదారిపై జువెలరీ షాప్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన వినాయక మండపంలో వినాయక చవితి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని



ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండపం నిర్వాహకులు సుమారు 5 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి గణనాథుడిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దీంతో హబ్సిగూడ ప్రధాన రహదారిపై ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గణేష్ నామస్మరణలు, భక్తుల సందడితో పరిసర ప్రాంతం మార్మోగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు, భక్తులుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక


## కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి:** వరంగల్ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కలిసి వినతిపత్రాలు అందజేశారు. కాకతీయ యూనివర్సిటీకి పీఎం–ఉషా నిధుల మంజూరు, వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర నిధులు, వరంగల్‌లో నైలిట్, సీఐటీడీ కేంద్రాల ఏర్పాటు, పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు అంశాలను ముఖ్యమంత్రికి ఎంపీ వివరించారు

వరంగల్ ప్రాంత విద్యార్థులు, యువత, పరిశోధకులు, ప్రజలకు మెరుగైన విద్య, నైపుణ్య, సాంకేతిక, కేంద్ర ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కాకతీయుల చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించే చర్యలకు కేంద్ర సహకారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం తరపున చొరవ చూపాలని వరంగల్ ఎంపీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు. అలాగే వరంగల్ ఎంపీతో పాటు స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ ప్రస్తావించిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయా ప్రతిపాదనలపై సంబంధిత శాఖలతో చర్చించి, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వరంగల్ ఎంపీ కావ్య వెల్లడించారు.

## తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానీయొద్దు

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** జిల్లా ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

శుక్రవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మిషన్, భూగర్భజలాలు, తాగునీటి నిర్వహణ, క్లోరినేషన్ తదితర అంశాలపై చర్చించారు. "అదనపు కలెక్టర్" మాట్లాడుతూ విద్యాసంస్థలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇళ్లకు నల్లా కనెక్షన్




ఇవ్వడంతోపాటు విధిగా ఓహెచ్ఎస్ క్లీనింగ్ చేపట్టాలన్నారు.

అంగన్వాడీలు, రైతు వేదికలు, ప్రభుత్వాసుపత్రులకు నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. "జలసిరి పనులు వేగవంతం చేయాలి" వీ బీజీ రాంజీ పథకం కింద ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమం పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ఫారం ఫండ్స్, ఇంకుడు గుంతల తవ్వకం పనులు చేపట్టడంతో పాటు బోర్ వెల్ రీఛార్జి పనులు చేయించాలన్నారు. రైతులు ముందుకు వచ్చేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్, డీఈవో చైతన్య జైనీ, డిఎంహెచ్వో రాజగోపాల్ , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 22వ వార్డులో సాక్షి గణపతి కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం

**అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన వార్డు కౌన్సిలర్ తూణం కృష్ణ**

**కోదాడ, అక్షిత ప్రతినిధి:** కోదాడ పట్టణంలోని 22వ వార్డులో సాక్షి గణపతి కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహం వద్ద శుక్రవారం మహా అన్నదానం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ తూణం కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు.అంతకుముందు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు సుఖసంతోషాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. అనంతరం భక్తులు, స్థానికులకు మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద



సంఖ్యలో భక్తులు, వార్డు ప్రజలు కార్యక్రమానికి హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని వార్డులో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొంటూ గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.మహా అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తి భావంతో పాటు సేవా స్ఫూర్తిని చాటుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన కమిటీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో మేకల సందీప్, వెలిశాల పురుషోత్తం, చందా రాజేష్, పొనుగోటి అక్షయ్ తేజ, మణికంత, ఉదయ్ సాయి, జానీ, భరత్, వంశీ , అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగానికి దివిస్ పరిశ్రమ సేవలు అభినందనీయం

**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** చౌటుప్పల్ పురపాలక పరిధి తంగడపల్లి గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం స్థానిక దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాన్ని కౌన్సిలర్లు ఊదరి యాదయ్య,కొయ్యడ శేఖర్ చేతుల మీదుగా ప్రారంభించి నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ కాటమరాజు, డాక్టర్ సౌజన్య, డాక్టర్ నరేష్‌లు సుమారు 480 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అతిథుల చేతుల మీదుగా ఉచితంగా విద్యార్థులకు మందులను అందజేశారు. అనంతరం 2,12,318 రూపాయల విలువగల 4,686 నోట్ బుక్స్ లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యారంగానికి దివిస్ పరిశ్రమ




చేస్తున్న సేవలు అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 6వా వార్డు నాయకులు ఆలే చిరంజీవి, 15వ వార్డు నాయకులు గడ్డం రాజ రత్నం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పద్మ, ప్రధానోపాధ్యాయులు భార్గవి, వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, దివిస్ పరిశ్రమ ప్రతినిధులు బి గోపి, జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పేదరికాన్ని జయించి వైద్య సీటు సాధించిన "విద్యార్థిని సరితకు" అండగా..

**టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**వైద్య విద్య కొనసాగించేందుకు 1,00,000/-(ఒక లక్ష ) ఆర్థిక సహాయం..**





**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి:** వెల్దండ పట్టణానికి చెందిన నిరుపేద విద్యార్థిని గుద్దేటి సరిత.పేదరికాన్ని ఎదుర్కొంటూ, ఎన్నో కష్టాలను అధిగమించి పట్టుదలతో చదివి వైద్య విద్యలో సీటు సాధించారు.చిన్నతనంలోనే తండ్రిని(శేఖర్) కోల్పోయిన సరితకు ఆమె తల్లి అలివేలు దినసరి కూలీగా పనిచేస్తూ చదువుకు అండగా నిలుస్తున్నారు. వైద్య విద్యలో సీటు సాధించినప్పటికీ.. ఫీజులు,వసతి,పుస్తకాలు, ఇతర విద్యా ఖర్చులను భరించడం సరిత కుటుంబానికి భారంగా మారింది,ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన వైద్య విద్యకు ఎలాంటి ఆటంకం కలగకూడదనే పరిస్థితిలో సహాయం కోసం ఎదురుచూస్తున్న విద్యార్థిని సరిత పరిస్థితి తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి స్పందించారు.

సరిత వైద్య విద్యను ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు అడ్డుకోకూడదనే ఉద్దేశంతో 1,00,000/- లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని చెక్ రూపకంగా అందించారు.పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదు.ప్రతి విద్యార్థి తన కలను సాకారం చేసుకునేలా అండగా నిలవాలి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సూచించారు.

సరిత చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయి ఎన్నో కష్టాలను ఎదుర్కొంది,అయినప్పటికీ తన పరిస్థితులను చూసి వెనుకడుగు వేయకుండా, చదువుపై దృష్టి పెట్టి వైద్య విద్యలో సీటు సాధించడం ఎంతో అభినందనీయం, ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులకు మన వంతుగా అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావిస్తున్నాను..విద్య కోసం చేసే సహాయం ఒక కుటుంబానికే కాదు.ఒక తరం భవిష్యత్తుకు బలాన్నిస్తుంది,ప్రతిభ ఉన్న ప్రతి పేద విద్యార్థికి ప్రోత్సాహం అందించాలనే సంకల్పంతో ఐక్యత ఫౌండేషన్ ద్వారా ముందుకు సాగుతున్నాం.. సరిత తన లక్ష్యాన్ని సాధించే వరకు నా సహకారం, ప్రోత్సాహం ఆమెకు ఉంటాయి, అలాగే నాతో పాటు మరికొంత మంది దాతలు ముందుకు వచ్చి సరితకు అండగా నిలవాలని ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు రూ,1 లక్ష ఆర్థిక సహాయం అందించి తన వైద్య విద్యకు అండగా నిలిచిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి సరిత,ఆమె తల్లి మరియు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు పేదరికం కారణంగా తన వైద్య విద్యను ఎలా కొనసాగించాలనే ఆందోళనలో ఉన్న సమయంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అందించిన సహాయం తమ కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని తెలిపారు,తన చదువుకు అండగా నిలిచిన ఈ సహాయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని ,వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి పేద ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని సరిత భావోద్వేగంతో పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో.. మాజీ సర్పంచ్‌లు రామచంద్రయ్య,పంతుల నాయక్,శ్రీరాములు,నరేందర్ గౌడ్,సీనియర్ నాయకులు పోలే వెంకటేశ్,కృష్ణ,అల్లాజీ, రామాంజనేయులు,శ్రీను నాయక్,చంద్ర శేఖర్, కొండల్ యాదవ్,రమేష్ యాదవ్,రాహుల్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**ఐసీడీఎస్ సూపర్ వైజర్ వంగాల పద్మ**

**అలుగునూరు అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా 'రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలు'**

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** దేశవ్యాప్తంగా జరుగుతున్న 'రాష్ట్రీయ పోషణ్ మాస్' వేడుకల్లో భాగంగా, అలుగునూరు-2 పరిధిలోని కాకతీయ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ




కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్ వైజర్ వంగాల పద్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

గర్భిణులు, పాలిచ్చే తల్లులు (బాలింతలు) కౌమార దశలోని బాలికల్లో నెలకొన్న పోషకాహార లోపాన్ని నివారించి, రక్తహీనతను పారద్రోలడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో పౌష్టికాహారానికి



పెద్దపీట వేయాలని సూచించారు.

ఈ సందర్భంగా పలు ఆహార పదార్థాల ప్రాముఖ్యతను వారు వివరించారు.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలకు అందించే బాలామృతంలో విటమిన్ ఏ" పుష్కలంగా ఉంటుందని తెలిపారు.

వీటిని రోజూ తీసుకోవడం వల్ల విటమిన్ ఏ సి కె, తో పాటు ఐరన్ శరీరానికి సమృద్ధిగా లభిస్తుందన్నారు.

గుడ్లు, పాలు చిన్నపిల్లలకు, తల్లులకు అత్యవసరమైన ప్రోటీన్లు, కాల్షియం వీటి ద్వారా అందుతాయని, ఎముకల దృఢత్వానికి ఇవి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు.

రాగులు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా శరీరంలో సహజసిద్ధమైన రోగనిరోధక శక్తి పెరుగుతుందని అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్త బి. లత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు, విద్యార్థులు, చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమృత రామానుజ రావు ట్రస్టు సేవలు

**నైపుణ్యత గల విద్యార్థులకు ట్రస్ట్ ప్రోత్సాహం అభినందనీయం**

**కళాశాల ప్రిన్సిపల్ ఎన్ రమణారెడ్డి**

**కోదాడ, అక్షిత ప్రతినిధి:** అమృత రామానుజా రావు ట్రస్ట్ తరపున ప్రతి సంవత్సరం ప్రతిభ కనబరచిన.ప్రభుత్వ హై స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు అందించే పురస్కారాలను శుక్రవారం కె ఆర్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమ లో ప్రతిభ గల విద్యార్థులకు అందించడం జరిగింది..ముఖ్య అతిథి లుగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్.రమణా రెడ్డి ముఖ్య అతిథి గా హాజరైన.ఈ కార్యక్రమానికి ట్రస్ట్ చైర్మెన్ కొండపల్లి శేష.ప్రసాద్ అధ్యక్షత.వహించారు..ఈ సందర్భంగా ఏడు గురు జూనియర్ కళాశాల.విద్యార్థులకు బంగారు పతకాలను పురస్కారాలను అందించగా...ముగ్గురు హై స్కూల్ విద్యార్థులకు బంగారు పతకాలను పురస్కారాలను అందజేశారు...ఈ సందర్భంగా ముఖ్య.అతిథులు ప్రసంగిస్తూ.. ఏ ఆర్ టి సంస్థ విద్యార్థులకు అందజేస్తున్న అవార్డ్ లను ప్రశంసించారు...విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియ జేశారు... ఏఆర్‌టీ వ్యవస్థాపకులు తమ ప్రాంతానికి చేస్తున్న.సేవా కార్యక్రమాలు ను అభినందించారు. ఏ ఆర్ టి చైర్మెన్ కొండపల్లి శేష ప్రసాద్ మాట్లాడుతూ ఏ ఆర్ టి ప్రతిభ గల విద్యార్థులకు ప్రతి ఏడాది పురస్కారాలను అందించడం తో పాటు విద్యార్థుల లో నైపుణ్యం పెంచడానికి ఉత్తమ ఉపన్యాసాలతో వివిధ






అంశాల పై అవగాన ఏర్పాటు కార్యక్రమాలను చేస్తున్నట్లు తెలియజేశారు..కోదాడ ప్రాంత విద్యార్థులు అన్ని రంగాలలో మరింత రాణించాలని... ఏ ఆర్ టి ద్వారా ఈ కార్యక్రమం చేపట్టడం తమ అదృష్టం గా భావిస్తున్నట్లు తెలియజేశారు..ఈ కార్యక్రమం లో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వేముల.వెంకటేశ్వర్లు..కళాశాల సిబ్బంది. ఏ ఆర్ టి సెక్రటరీ మంత్రిప్రగడ శ్రీధర్ రావ్...సభ్యులు అక్కిరాజు యశ్వంత్...కొండపల్లి రంగారావు. వనం నాగేశ్వర్ రావు.. దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేతో స్పష్టత

**రీ-సర్వేపై అవగాహన సదస్సులో ఎమ్మెల్సీ శంకర్ నాయక్**

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి:** భూముల రీ-సర్వే ప్రక్రియపై రైతులు, ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలం గోగువారిగూడెం గ్రామంలో రీ సర్వే ప్రారంభించిన సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూముల రీ సర్వే ద్వారా భూ రికార్డులను పకడ్బందీగా రూపొందించడంతో పాటు, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రీ సర్వే ప్రక్రియపై రైతులకు, ప్రజలకు ఉన్న సందేహాలను అధికారులు నివృత్తి చేయాలని సూచించారు. భూ రికార్డుల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా రెవెన్యూ




అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఎమ్మెల్సీ సూచించారు. భూముల రీ సర్వే వల్ల భూ యజమానులకు స్పష్టత ఏర్పడుతుందని ఆర్డీఓఎస్.రమణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ పి.శ్రీనివాస్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ టి. రామకృష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## నాణ్యతతో బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలి

**వెన్నచర్ల-గన్యాగుల రోడ్డు పనులను పరిశీలించిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్**

**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలంలోని వెన్నచర్ల నుంచి గన్యాగుల వరకు నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను పెద్దకొత్తపల్లి మండల మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కాంట్రాక్టర్ రాజేందర్ గౌడ్, సూపర్ వైజర్ నర్సింహకు సూచించారు. నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని, నాణ్యతలేని పనులు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు. రోడ్డులో అనవసర వంపులు లేకుండా నిర్మాణం చేపట్టాలన్నారు. వర్షాకాలంలో వరద నీటికి రోడ్డు దెబ్బతినకుండా అవసరమైన చోట కల్వర్టులు నిర్మించాలన్నారు. పెద్ద చెరువు కట్ట వద్ద అలుగు సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని, చెరువు వెనుక భాగంలో నిర్మించాల్సిన బ్రిడ్జిలను ఏఈ, డీఈల పరిశీలన, సాంకేతిక సూచనల మేరకు నిర్మించాలని సూచించారు. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా నాణ్యత, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నక్కలపల్లి సర్పంచ్ మొట్టే కురుమయ్య, ఉప సర్పంచ్ లు బై రాముడు, కొత్త రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ దేవరపాగ రవికుమార్, సెక్రటరీ జి. సుబ్రహ్మణ్యం, వార్డు సభ్యులు మద్దని పద్మ, అగరయ్య, ఓర్సు నాగమ్మ, చిన్న సుల్తాన్, డి. మంజుల, దేవరాజ్, కాంగ్రెస్ నాయకులు జంగం పెద్ద నాగరాజు, బొల్లె ఈశ్వరయ్య, జి. సుధాకర్, ఎండీ సలీమ్, బెల్లె మల్లయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్య శిక్షణల ద్వారా మహిళలు ఆర్థిక ప్రగతి

**ఎఫ్ఎంఎం, సాంఘిక సేవా సంస్థ సేవలు**

**చిన్నపిల్లలు, మహిళల అభివృద్ధి పట్ల ప్రశంసనీయం**

**సామాజిక సేవకులు డాక్టర్ పాలడుగుల సురేందర్**

**వరంగల్, అక్షిత బ్యూరో:** శుక్రవారం వరంగల్ కాశీబుగ్గ లో ఎఫ్ ఎం ఎం సాంఘిక సేవా సంస్థ సహకారంతో ప్రేమ్ హెల్పింగ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత మగ్గం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సామాజిక వేత్త డాక్టర్ పాలడుగుల సురేందర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో




పిల్లలపైన మహిళల పైన అనేక రకాలుగా హింస జరుగుతుందని దీనికి పేదరికం కూడా ఒక కారణమని కావున పిల్లలు ఒక ఉన్నతమైన చదువులు చదవాలన్న మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలన్న నైపుణ్య శిక్షణ ఎంతగానో ఉపయోగపడతాయని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు వారి స్వయం ఉపాధి మార్గాలని ఎంచుకోవాలని కోరారు

ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బత్తుల కరుణ హాజరై మాట్లాడుతూ సంస్థ కొన్ని సంవత్సరాలుగా మహిళల పిల్లల సంక్షేమం కొరకు పనిచేస్తుందని పిల్లలపైన మహిళల పైన హింసను నిర్మూలించడానికి మహిళా సాధికారత సాధించాలనే ఉద్దేశంతో వివిధ రకాల నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను మహిళలకు అందజేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్ ,ఫైనాన్స్ మేనేజర్ ఎం అజయ్ కుమార్ ,మగ్గం ట్రైనర్ వాణి ప్రేమ్ హెల్పింగ్ ట్రస్ట్ చైర్మన్ ప్రేమ్సాగర్ ,కోఆర్డినేటర్ సుగుణ, పృథ్వి తదితరులతోపాటు శిక్షణ పొందే మహిళలు హాజరైనారు కార్యక్రమానికి హాజరైన మహిళలకు మగ్గం సామాగ్రిని ఉచితంగా అందజేసారు.

## అందె అశోక్‌ను అభినందించిన ఎస్ఐ అపూర్వ రెడ్డి

**చేర్యాల అక్షిత ప్రతినిధి:** చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన సిపిఐ నేత అందె అశోక్ శుక్రవారం తన పని మీద చేర్యాలకు వస్తుండగా ఆకునూరు-చేర్యాల మార్గమధ్యలో రహదారిపై ఒక మొబైల్ ఫోన్ పడి ఉండటం గమనించారు. వెంటనే ఆ ఫోన్‌ను తీసుకొని చేర్యాల పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీసులు ఫోన్ నెంబర్ ఆధారంగా యజమానిని గుర్తించగా ధూల్మిట్ట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గద్దల స్నేహ గా తేలింది. పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గూడ అపూర్వరెడ్డి చేతుల మీదుగా 50వేల విలువ చేసే మొబైల్ ఫోన్‌ను యజమాని స్నేహకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అపూర్వరెడ్డి అందె అశోక్ నిజాయితీని అభినందించారు.




## పేద విద్యార్థులకు గొప్ప వరం బిఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

**- డాక్టర్ ధర్మానాయక్**

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి:** విద్యను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాలను, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బిఆర్ఏఓయు) కృషి చేస్తోందని, పేదలకు ఈ విశ్వవిద్యాలయం గొప్ప వరమని అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ విశ్వవిద్యాలయ ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి, డాక్టర్ బి.ధర్మానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణం కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రంలో నిర్వహించిన కౌన్సెలర్లు విలేకరుల సమావేశంలో ఆయన విద్యార్థులకు చదువుతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దూరవిద్య ద్వారా లభిస్తాయని అన్నారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు, విద్యా విధానాలను అమలు చేస్తోందని, మహిళా విద్యార్థినులకు (వీ హబ్) ద్వారా వ్యాపారాభివృద్ధి, ఆవిష్కరణలు, నైపుణ్య శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు.



యూనివర్సిటీ టీసీఎస్, ఐకాన్, రామానందతీర్థ ఇన్‌స్టిట్యూట్, రాశి, వి-హబ్ వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుందని తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. 2026 విద్యా సంవత్సరానికి యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని, అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి ఆధ్వర్యంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కొరకు నూతన కోర్సులను రూపొందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కళాశాల ప్రధానాచార్యులు మల్గిరెడ్డి భీమర్జునరెడ్డి, కళాశాల కో-ఆర్డినేటర్ పి. నాగరాజు, జాక్టో ఎం.వెంకన్న, అధ్యయన కేంద్రం కౌన్సెలర్లు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY


## ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక

**బడిబాటలో విద్యార్థుల అధిక నమోదు ఆధారంగా ఎంపిక..**

**రేపు పురస్కారాల ప్రదానోత్సవం**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట మండలంలో 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ఎంపిక కార్యక్రమాన్ని ఈ నెల 26న నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి టి. సురేందర్ రెడ్డి తెలిపారు.రామన్నపేటలోని శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో అత్యధికంగా విద్యార్థుల నమోదు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు ఎంఈఓ తెలిపారు. ప్రాథమిక పాఠశాలల విభాగం: కొమ్మాయిగూడెం – కె. కోటేష్, శోభనాద్రిపురం – పి. కళావతి, వెల్లంకి – ఎం. వెంకటయ్య, ఎన్నారం – ఎస్.కే. మస్తాన్, రామన్నపేట – బి. సునీత ఎంపికయ్యారు. ఉన్నత పాఠశాలల విభాగం: కొమ్మాయిగూడెం – బి. బాలరాజు, జనంపల్లి – ఆర్. శంకర్, ఎన్నారం – ఎన్. శేఖర్, ఇంద్రపాలనగరం – కె. శ్రీనివాస్ రెడ్డి, మునిపంపుల – ఎన్. మనోహర్, వెల్లంకి – కసాని స్వప్న ఎంపికయ్యారు. జిల్లా ఉత్తమ పురస్కార గ్రహీతలు: దుబ్బాక – కె. లలిత, జనంపల్లి – కె. సందీప్ కుమార్, రామన్నపేట బీసీ కాలనీ– వి. జనార్ధన్ ఎంపికయ్యారు. బడిబాటలో అధిక నమోదు సాధించిన పాఠశాలలు: ఇంద్రపాలనగరం– కె.శేఖర్, శోభనాద్రిపురం – జి. శ్రీనివాస్ రెడ్డి, బాచుప్పల – వి. వెంకటయ్య ఎంపికైనట్లు ఎంఈఓ తెలిపారు.

## తాండూర్‌లో 72 శాతం ఎన్నికల ప్రక్రియ పూర్తి

**మున్సిపాలిటీ, గౌతాపూర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన**

**ఎన్నికల అధికారి సీఈఓ సుదర్శన్ రెడ్డి**

**తాండూరు, అక్షిత ప్రతినిధి:** జిల్లాలో కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియ 72 శాతం పూర్తయిందని,రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తాండూరులో పర్యటించిన ఆయన పాత మున్సి పాలిటీతో పాటు గౌతాపూర్‌లో ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా సవరణ, నోటీసుల పంపిణీని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఇప్పటి వరకు 72 శాతం నోటీసులు



పంపిణీ చేసినట్లు తెలిపారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన ఆధార పత్రాలను బీఎల్‌ఓలు లేదా తహసీల్దార్ కార్యా లయంలో సమర్పించాలని, సూచించారు. ఆన్‌లైన్ లోనూ పత్రాలు సమర్పించే అవకాశం ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియలో పార దర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ, మిగిలిన ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, అధికారులకు సూచించారు. పాత మున్సిపాలిటీ, గౌతాపూర్ లో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్య లను గుర్తించి పరిష్క రించాలని, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా అధి కారులు సమన్వయంతో పనిచేయాలని, సీఈఓ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

## జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా పరిశుభ్రత-పచ్చదనం కార్యక్రమం

**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని పురస్కరించుకుని రామన్నపేట స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం రెండు యూనిట్ల ఆధ్వర్యంలో 'పరిశుభ్రత–పచ్చదనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టడంతో పాటు పచ్చదనం పెంపొందించేలా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రధానాచార్యులు రాహత్ ఖానం మాట్లాడుతూ, జాతీయ సేవా పథకం ద్వారా దేశవ్యాప్తంగా వివిధ కళాశాలల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులు సేవా దృక్పథాన్ని పెంపొందించుకుంటూ సమాజ సేవలో భాగస్వాములవుతున్నారని తెలిపారు.

'నా కోసం కాదు.. మీ కోసం' అనే సేవా స్ఫూర్తితో ఎంతోమంది విద్యార్థులు జాతీయ సేవా పథకంలో వాలంటీర్లుగా చేరి వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అన్నారు. సమాజంలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం




పెంపు, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. పరిశుభ్రమైన పరిసరాలు, పచ్చని వాతావరణం ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలను నాటి వాటి సంరక్షణకు బాధ్యత వహించాలని ప్రధానాచార్యులు సూచించారు.

ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ జె. చిన్నబాబు, డాక్టర్ జి. సునీత, కళాశాల అధ్యాపకులు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.

## ఉత్తమ ప్రధానాచార్య పురస్కారం అందుకున్న ఆచార్య రాహత్ ఖానంకు అభినందనలు

**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం రామన్నపేట లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రధానాచార్య పురస్కారం అందుకున్న సందర్భంగా కళాశాల స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్. రత్న మంజుల మాట్లాడుతూ.. అధ్యాపకులుగా, ప్రధానాచార్యులుగా 28 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఎంతోమంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిని ఉన్నత విలువలు కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో ఆచార్య రాహత్ ఖానం విశేష కృషి చేశారని అన్నారు. విద్యారంగ అభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.




ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ.. విద్యను అభ్యసించడం వల్లే అధ్యాపకులుగా, అనంతరం ప్రధానాచార్యులుగా సేవలందించే అవకాశం లభించిందన్నారు. తనకు లభించిన పురస్కారాన్ని కళాశాలకే అంకితం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ ఎం. రవీందర్ రావు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. కిషన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. లక్ష్మీ నీలిమ, పరిపాలనాధికారి జి. కరుణాకర్‌తో పాటు అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రారంభోత్సవానికి ముస్తాబైన నూతన కలెక్టరేట్

**ఈనెల 30న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం**

**అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన భవనం**

**ఒకే చోట ప్రభుత్వ శాఖలు ప్రజలకు మరింత సౌకర్యం**

**విశాలమైన పార్కింగ్ ఆధునిక వసతులు**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ జిల్లా పరిపాలనకు కొత్త రూపు సంతరించుకోనుంది. జిల్లా కేంద్రంలో నిర్మించిన నూతన కలెక్టరేట్ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. ఈనెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే భవన నిర్మాణ పనులు పూర్తికాగా.. ప్రారంభోత్సవ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి.నూతన కలెక్టరేట్ భవనాన్ని ఆధునిక సౌకర్యాలతో రూపొందించడంతో జిల్లా పరిపాలన మరింత సమర్థంగా సాగేందుకు అవకాశం ఏర్పడనుంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాలను ఒకే సముదాయంలోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు సేవలు అందుకోవడంలో ఇబ్బందులు తగ్గనున్నాయి

**.""ఒకే చోట అన్ని శాఖలు""**

జిల్లా పరిపాలనలో కీలక పాత్ర పోషించే కలెక్టరేట్‌లో రెవెన్యూ, అభివృద్ధి, సంక్షేమం తదితర పరిపాలనా విభాగాలకు సంబంధించిన కార్యకలాపాలు కొనసాగుతాయి. అధికారిక జిల్లా వెబ్‌సైట్ ప్రకారం కలెక్టరేట్‌లో వివిధ పరిపాలనా విభాగాలు పనిచేస్తున్నాయి. నూతన సముదాయంలో వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలను అందుబాటులోకి తీసుకురావడం వల్ల ఒక శాఖ నుంచి మరో శాఖకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. జిల్లా ప్రజలు తమ సమస్యలు, దరఖాస్తులు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన పనుల కోసం ఒకే ప్రాంగణంలో సంబంధిత అధికారులను సంప్రదించే అవకాశం ఏర్పడనుంది.

**""ప్రజలకు మరింత చేరువగా పరిపాలన""**

కలెక్టరేట్ అంటే జిల్లా పరిపాలనకు కేంద్రబిందువు. జిల్లా స్థాయిలో అభివృద్ధి, రెవెన్యూ, సంక్షేమం, శాంతిభద్రతలు, ఎన్నికలు తదితర అంశాలకు సంబంధించిన పరిపాలనా వ్యవహారాల్లో కలెక్టర్ కీలక పాత్ర పోషిస్తారు.నూతన భవనం అందుబాటులోకి రావడంతో అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల మధ్య సమన్వయం మరింత సులభతరం కానుంది. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడనుంది.

**""విశాలమైన పార్కింగ్ సదుపాయం""**

నూతన కలెక్టరేట్‌లో ప్రధాన ఆకర్షణల్లో విశాలమైన పార్కింగ్ సదుపాయం ఒకటి. వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే అధికారులు, ఉద్యోగులు, ప్రజల వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యం కల్పించడంతో వాహనాల రద్దీని నియంత్రించేందుకు అవకాశం ఉంటుంది.ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఎదుర్కొనే ప్రధాన సమస్యల్లో పార్కింగ్ కూడా ఒకటి. నూతన సముదాయంలో వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలం ఉండటంతో ఈ సమస్యకు కొంతవరకు పరిష్కారం లభించనుంది.

**""ఆధునిక సౌకర్యాలతో నూతన రూపం""**

నూతన కలెక్టరేట్ భవనాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా రూపొందించినట్లు అధికారులు తెలిపారు. కార్యాలయ గదులు, సమావేశాల నిర్వహణకు అవసరమైన వసతులు, ప్రజల రాకపోకలకు అనువైన ఏర్పాట్లు, వివిధ శాఖలకు ప్రత్యేక కార్యాలయ విభాగాలు వంటి సదుపాయాలతో భవనాన్ని సిద్ధం చేశారు.జిల్లా స్థాయి అధికారుల సమావేశాలు, సమీక్షలు, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన కార్యక్రమాలను ఒకే ప్రాంగణంలో నిర్వహించేందుకు వీలు కలగనుంది.

**""ప్రారంభోత్సవ ఏర్పాట్లు ముమ్మరం""**

ఈనెల 30న జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా భవనం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రారంభోత్సవ వేదిక, అతిథుల రాకపోకలు, భద్రత, పార్కింగ్, ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన కలెక్టరేట్ భవనాన్ని సందర్శించి అధికారులతో సమీక్షించారు కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.కలెక్టరేట్ ప్రాంగణంలో శుభ్రత, అలంకరణ, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర పనులు కొనసాగుతున్నాయి. భవనం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రారంభోత్సవానికి వచ్చే అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు.

**""భద్రతపై ప్రత్యేక దృష్టి""**

ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమం కావడంతో భద్రతా ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్, అతిథుల ప్రవేశం, ప్రజలు వీక్షించే ప్రాంతాలు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నారు.

**""జిల్లా పరిపాలనకు కొత్త చిరునామా"**

నూతన కలెక్టరేట్ అందుబాటులోకి రావడంతో జిల్లా పరిపాలనకు ఒక సమగ్ర కేంద్రం ఏర్పడనుంది. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించడంతో పాటు అధికార యంత్రాంగం పనితీరులో సమన్వయం పెంచేందుకు ఇది ఉపయోగపడనుంది. కరీంనగర్ జిల్లా అధికారిక వివరాల ప్రకారం జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు, 16 మండలాలు, 313 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇంత విస్తృతమైన పరిపాలనా పరిధి ఉన్న జిల్లాకు ఆధునిక వసతులతో కూడిన కలెక్టరేట్ సముదాయం పరిపాలనా అవసరాలకు ఉపయోగకరంగా ఉండనుంది.

**" ప్రజల పనులు సులభతరం"**

రెవెన్యూ, సంక్షేమం, పౌరసరఫరాలు, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ప్రజలు తరచూ జిల్లా కార్యాలయాలను ఆశ్రయిస్తుంటారు. వివిధ శాఖలు ఒకే ప్రాంగణంలో అందుబాటులో ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించడం సులభతరం అవుతుంది. ప్రభుత్వ సేవల్లో డిజిటల్ విధానాలు పెరుగుతున్నప్పటికీ.. ప్రజలకు నేరుగా అధికారులను కలిసే అవసరం ఉన్న సందర్భాల్లో నూతన కలెక్టరేట్ సముదాయం ఉపయోగపడనుందన్నా ఆశ భావం ప్రజల నుండి వ్యక్తమవుతుంది

**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా**

జిల్లా జనాభా, పరిపాలనా అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు తగిన మౌలిక వసతులు అవసరం. ఈ నేపథ్యంలో నూతన కలెక్టరేట్ భవనం జిల్లా పరిపాలనకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా రూపొందించబడింది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, ప్రజలకు సేవలు, అధికారుల సమావేశాలు, జిల్లా స్థాయి సమీక్షలు తదితర కార్యక్రమాలకు ఒకే సముదాయం వేదికగా మారనుంది.

**"ప్రారంభోత్సవం కోసం ఆసక్తిగా ఎదురుచూపులు"**

నూతన కలెక్టరేట్ భవనం ప్రారంభోత్సవానికి సమయం దగ్గరపడటంతో జిల్లా ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ఈనెల 30న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ భవనం అందుబాటులోకి వస్తే కరీంనగర్ జిల్లా పరిపాలనకు కొత్త రూపు రానుంది.జిల్లా అధికార యంత్రాంగం ఒకే చోట అందుబాటులో ఉండటం, వివిధ శాఖల మధ్య సమన్వయం పెరగడం, ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందే అవకాశం ఉండటం వంటి అంశాలు నూతన కలెక్టరేట్ ప్రత్యేకతలుగా నిలవనున్నాయి.ఏదేమైనా నూతన కలెక్టరేట్ భవనం కేవలం ప్రభుత్వ కార్యాలయాల సముదాయం మాత్రమే కాకుండా.. జిల్లా పరిపాలనకు కేంద్రబిందువుగా, ప్రజలు–ప్రభుత్వ యంత్రాంగం మధ్య వారధిగా నిలిచేలా సిద్ధమవుతోంది. ఈనెల 30న జరగనున్న ప్రారంభోత్సవంతో కరీంనగర్ జిల్లా పరిపాలన కొత్త భవనంలోకి అడుగుపెట్టనుంది.

## సఖి కేంద్రం సేవలు మరింత సమర్థవంతంగా అందించాలి

**జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్**

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** మహిళలకు రక్షణ, న్యాయ సహాయం, కౌన్సెలింగ్‌తో పాటు అవసరమైన సేవలను అందిస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్ సూచించారు. శుక్రవారం ప్యానల్ అడ్వకేట్లతో కలిసి కరీంనగర్ సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించిన ఆయన, కేంద్రంలో నమోదవుతున్న కేసులు, బాధితులకు అందుతున్న న్యాయ సహాయం, కౌన్సెలింగ్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం తదితర సేవలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు, కేసు ఫైళ్లు, రికార్డులను పరిశీలించి, కేసుల పురోగతిపై సమీక్షించారు. షెల్టర్ రూమ్, కౌన్సెలింగ్ గదులు, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతతో పాటు బాధితులకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రొటెక్షన్ ఆఫీసర్, సఖి కేంద్రం ద్వారా దాఖలయ్యే గృహహింస కేసులను క్రమం తప్పకుండా సమీక్షిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖలు, లీగల్ కౌన్సిల్, సఖి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. బాధితుల గోప్యతను కాపాడుతూ వారి హక్కులు, అందుబాటులో ఉన్న న్యాయ పరిహారాలపై అవగాహన




కల్పించాలని సూచించారు. న్యాయ సహాయం అవసరమైన బాధితులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మహేష్ తణుకు, ప్యానల్ అడ్వకేట్లు ఏ. కిరణ్ కుమార్, పెరుక రంగయ్య, సి.హెచ్. చంద్రప్రకాష్ రెడ్డి, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ దామెర లక్ష్మి, లీగల్ కౌన్సిలర్ ఎన్. సంధ్యారాణి, సోషల్ కౌన్సిలర్ రేణుక, కేస్ వర్కర్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

**గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**తాండూరు అక్షిత ప్రతినిధి:** తాండూరు మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన నూతన గృహాల్లో గృహ ప్రవేశ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణం లోని 9వ వార్డులో నూతనంగా నిర్మించిన సగ్గెం ఇందిర, నారాయణ ఇందిరమ్మ ఇళ్లతో పాటు 27వ వార్డులో నూతనంగా నిర్మించిన రజియా బేగం, దస్తగిర్ ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి నూతన



గృహాల్లోకి అడుగుపెట్టిన లబ్ధిదారులను కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. సొంతింటి కల సాకారం కావడం పట్ల లబ్ధిదారులతో మాట్లాడి, వారి ఆనందాన్ని పంచుకున్నారు.

పేద, మధ్య తరగతి కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేద కుటుంబాలకు భద్రమైన నివాసం లభించ దంతో పాటు వారి జీవితాల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయని, పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి



చేస్తున్నామని, ప్రజ లకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అన్నారు. నూతన గృహాల్లో గృహప్రవేశం చేసుకున్న లబ్ధిదారులు తమ సొంతింటి కల నెరవేర దంతో సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు కోసం ఎదురుచూస్తున్న తమ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహం లభించడం ఆనందంగా ఉందన్నారు. తమకు సొంతింటిని అందించేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి ఎల్లప్పుడూ, రుణపడి ఉంటా మని లబ్ధిదారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజాబాల్ రెడ్డి, మాజీ చైర్పర్సన్ సప్న పరిమల్, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, పట్టణ అధ్యక్షులు బాతుల నాగరాజు, బంటు మల్లప్ప, కౌన్సిలర్లు ఉప్పరి స్వరూప మల్లేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## జిల్లాకు అదనపు జూనియర్ సివిల్ కోర్టులను మంజూరు చేయడం హర్షణీయం

**చౌటుప్పల్ కోర్టు బారసోసియేషన్ అధ్యక్షులు తాడూరి పరమేష్**

**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లాకు 7 అదనపు జూనియర్ సివిల్ కోర్టులను మంజూరు చేయడం హర్షణీయమని చౌటుప్పల్ కోర్టు బారసోసియేషన్ అధ్యక్షులు తాడూరి పరమేష్ అన్నారు.తెలంగాణ ప్రభుత్వం యాదాద్రి భువనగిరి జిల్లాకు 7 అదనపు జూనియర్ సివిల్ కోర్టులను మంజూరు చేయడం హర్షణీయమని, అందులో చౌటుప్పల్ కోర్టు కాంప్లెక్స్‌కు 2 అదనపు జూనియర్ సివిల్ కోర్టులు ఏర్పాటు చేయడం పట్ల చౌటుప్పల్ బార్



అసోసియేషన్ తరఫున హర్షం వ్యక్తం చేస్తున్నామని తాడూరి పరమేష్ అన్నారు. ఈ నిర్ణయంతో చౌటుప్పల్ ప్రాంత ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ కానున్నాయి. అదనపు కోర్టుల ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి లకు బారసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కోర్టులో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో న్యాయవాదులకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బారసోసియేషన్ అధ్యక్షులు తాడూరి పరమేష్, ఉపాధ్యక్షులు పిట్టల భిక్షమయ్య,సహాయ కార్యదర్శి ముక్తాల నరసింహ,కల్చరల్ సెక్రటరీ దేశ గోని శ్రీశైలం, కార్యవర్గ సభ్యులు ఎండి ఖయ్యూం పాషా,పిల్లలమర్రి కిరణ్, మాజీ భారసోసియేషన్ అధ్యక్షులు బాల్యం వెంకట చలపతి,న్యాయవాదులు తడక మోహన్,జక్కర్తి శేఖర్,పాల పరమేష్, చామట్ల జంగయ్య, పిట్టల భరత్,అయితేగోని శ్రీకాంత్ లు పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు

**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా మేడ్చల్ డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మేడ్చల్ పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి



నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతే నిజమైన జాతి నిర్మాణం అని నమ్మిన సిద్ధాంతం కోసం ఆయన కృషి చేశారని బీజేపీ నాయకులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు పి ప్రభాకర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు రాగం అర్జున్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ దాస్, వంశి వంజరి, ఉపాధ్యక్షులు మైసరి రాజు, సర్వేశ్వర్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా నాయకురాలు హేమలత రెడ్డి, బచ్చు కృష్ణప్రియ, అనిత, సీనియర్ నాయకులు, సత్యనారాయణ, మోహన్ రావు, ఉపేందర్ గుప్తా, జాకట బాబు రాజు, రామచంద్ర రెడ్డి, బీజేవైఎం నాయకులు రాఘవరెడ్డి, గౌలికర్ మహేష్, సాయి కుమార్, వంశిధర్ రెడ్డి, నరేందర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు

# విదేశీ విద్య విధానాల అధ్యయనానికి ఉప్పునుంతల ఉపాధ్యాయుడు ఎంపిక



**నాగర్ కర్నూల్ , అక్షిత ప్రతినిధి:** విదేశీ విద్య విధానాల అధ్యయనానికి ఉప్పునుంతల ఉపాధ్యాయుడు ఎంపిక అయ్యారు.ఇంటర్నేషనల్ టీచర్స్ ఎక్స్పోజర్ ఉ ఎడ్యుకేషనల్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం లో భాగంగా వియత్నాం దేశం విద్య విధానం, బోధన, అభ్యసన పద్ధతుల అధ్యయనానికి బాలుర ప్రాథమిక పాఠశాల ఉప్పునుంతలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గాజుల వెంకటేష్, నాగర్ కర్నూల్ జిల్లా నుంచి ఎంపికయ్యారు.

వీరు అక్టోబర్ 10 నుంచి 17 వరకు వియత్నాంను సందర్శించ నున్నారు. వీరి ఎంపిక పట్ల ప్రయత్నాన్ని సహచర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలియజేశారు.

వెంకటేష్ ఉప్పునుంతల పాఠశాలకు 2018 సంవత్సరంలో బదిలీపై వెళ్ళినప్పుడు ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 25 మాత్రమే. బోధనకు పాఠశాల వాతావరణం అనుకూలంగా ఉండేది కాదు. అలాంటి పరిస్థితి నుంచి నేడు ఈ పాఠశాల విద్యార్థుల సంఖ్యను 105 కు పెంచడంలో సహ ఉపాధ్యాయులతో కలిసి ఎంతో కృషి చేశారు. తల్లిదండ్రుల కోరిక మేరకు 2018 సంవత్సరం నుంచే ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టారు. బోధనోపకరణాలతో, ఐ.సి.టి టూల్స్ ఉపయోగించి కృత్యాధార పద్ధతిలో విద్యార్థులకు అర్థవంతమైన నాణ్యమైన బోధన అందిస్తున్నారు. గురుకుల ప్రవేశ పరీక్ష కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఇప్పటివరకు ఈ పాఠశాల నుంచి 56 మంది విద్యార్థులు గురుకుల సీట్లు సాధించారు. ప్రత్యేకంగా స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించి విద్యార్థులను సులభంగా ఇంగ్లీష్ మాట్లాడిస్తున్నారు. చిల్డ్రన్ బ్యాంకు నిర్వహించి విద్యార్థుల్లో పొదుపు పైన అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలలో జాతీయ నాయకుల జయంతులు మరియు ప్రత్యేక దినోత్సవాలను నిర్వహించి విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను దేశభక్తిని పెంపొందిస్తున్నారు. క్షేత్ర పర్యటనల ద్వారా ప్రత్యక్ష అనుభవాలను కలిగిస్తున్నారు. తన ఇద్దరు పిల్లలను ఇదే పాఠశాలలో చదివించి, తల్లిదండ్రులకు పాఠశాలపై నమ్మకం కలిగించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించి విద్య ప్రాముఖ్యతను తెలియజేసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరే విధంగా కృషి చేశారు. పాఠశాలకు వాట్సప్ గ్రూపు, వెబ్సైట్, యూట్యూబ్ ఛానల్ ను రూపొందించి అందులో పాఠశాల అమలవుతున్న వినూత్న కార్యక్రమాలను, విద్యార్థుల ప్రగతిని, పాఠశాల అవసరాలను పొందుపరిచి సోషల్ మీడియా ద్వారా, వార్తాపత్రికల ద్వారా తల్లిదండ్రులకు సమాజానికి తెలియజేసి పాఠశాలకు కావలసిన వనరులను దాతల సహకారంతో ప్రొజెక్టర్, కలర్ ప్రింటర్, కంప్యూటర్లు, స్కూల్ బ్యాగులు, బూట్లు, స్టడీ మెటీరియల్, స్పోర్ట్స్ మెటీరియల్ మొదలైనవి సమకూర్చారు. టెట్ 2026లో గణితంలో 30కి 30 మార్కులు, మొత్తం 119 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. జియోబోర్డు ఉపయోగించి ప్రాథమిక స్థాయిలో అన్ని గణిత భావనలను ఎలా బోధించాలో వివరిస్తూ రాసిన పేపర్ రాష్ట్ర గణిత సెమినార్ కు ఎంపిక అయ్యింది. దీనిపైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది.

పాఠశాలలో నిర్వహిస్తున్న వినూత్న బోధన పద్ధతులపైన ఉత్తమ బోధనా పద్ధతుల పాఠశాలగా ఎంపికై దీనిపైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది.

రాష్ట్ర విద్యశాఖ అధికారులు అభినందించారు. సి.సి.ఆర్.టీ ఉదయ్ పూర్, రాజస్థాన్ లో నిర్వహించిన జాతీయస్థాయి శిక్షణకు ఎంపికై 15 రోజుల పప్పెట్రీ కోర్సుకు హాజరైనారు.

గణిత సబ్జెక్టులో జిల్లా రిసోర్స్ పర్సన్ గా మరియు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఇన్స్పెక్షన్ టీం లో సభ్యునిగా ఉంటూ ఉపాధ్యాయులకు మార్గదర్శకత్వం వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి, ప్రభుత్వ బడుల బలపేతానికి కృషి చేస్తున్నారు. కరోనా సమయంలో 17 నెలలు విద్యార్థులు పాఠశాలకు దూరంగా ఉన్నప్పుడు వారికి విద్యను అందించడానికి బేసిక్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్ మరియు ఉచిత గురుకుల ఆన్లైన్ తరగతులు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా వందల మంది విద్యార్థులు ఈ ఆన్లైన్ తరగతులు ఉపయోగించుకొని గురుకుల సీట్ల సాధించారు. ఉపాధ్యాయులకు డిజిటల్ బోధన పైన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తద్వారా ఎంతో మంది ఉపాధ్యాయులు కరోనా సమయంలో వారి విద్యార్థులకు ఆన్లైన్ బోధన నిర్వహించారు. 9వ తరగతి వరకు చదువులో వెనకబడిన వీరు వేసవి సెలవుల్లో 10వ తరగతి అడ్వాన్స్ తరగతులకు హాజరై బేసిక్స్ నేర్చుకొని, 10వ తరగతిలో గణితంలో 99 మార్కులు సాధించారు. ఈ ఒక నెల తన జీవితాన్ని మార్చింది. ఇదే స్ఫూర్తితో తాను ప్రభుత్వ ఉద్యోగంలోకి రాకముందే తన సొంత గ్రామం మాధవానిపల్లిలో నాలుగు సంవత్సరాల పాటు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, పదవ తరగతి అడ్వాన్స్ తరగతులు నిర్వహించారు. ఈ తరగతులు ఉపయోగించుకున్న వారు మెడిసిన్, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యను చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. తన జీవిత భాగస్వామి భౌతికతో కలిసి భారత్ విద్యా ఉద్యమం స్థాపించి విద్యార్థులకు ప్రేరణ తరగతులు, స్పోకెన్ ఇంగ్లీష్, ఆన్లైన్ గురుకుల తరగతులు నిర్వహిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందిస్తూ విద్యా వ్యాప్తికి విశేష కృషి చేస్తున్నారు.

# గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలి

**- ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులో ఉండాలి..**



**భద్రాచలం అక్షిత న్యూస్:** జిల్లావ్యాప్తంగాఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి వరద ఉధృత పై జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం మండ ల తహసిల్దార్లు, సంబంధిత అధికారుల తో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వర్షపాతం, గోదావరి నీటిమట్టం, రహదారులు, వంతెనలు, పాఠశాలలు, పంటలు, ఇళ్ల నష్టంపై మండలాల వారీగా మండల తాసిల్దార్లను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతున్న క్రమంలో ఎప్పటి,కప్పుడు వరదల పరిస్థితిని తెలుసుకొని లోతట్టు ప్రాంతాల ప్రజలకును అప్రమత్తం చేస్తూ ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వాధికారులను కలెక్టర్ ఆదేశించారు..

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నుంచి సుమారు లక్ష క్యూసెక్కుల నీటి ని దిగువకు విడుదల చేసినట్లు జల వనరుల శాఖ అధికారులు నుండి సమాచారం అందిందని, కనుక గోదావరి వరద ఉధృత పెరుగుతుందని, ఈ నేపథ్యంలో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 25 నుంచి 30 అడుగుల వరకు పెరిగే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తగా ఉండాలనిఅయన సూచించారు..

జిల్లాలోని పాత వంతెనలు, కల్వర్టులు, రహదారులను పరిశీలించి ప్రమాదకర ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ములకలపల్లి వద్ద, దెబ్బతిన్న వంతెనపై రాకపోకలను నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసి, దెబ్బతిన్న బ్రిడ్జి పనికి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు.

శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను వినియోగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. తాగునీరు, మధ్యాహ్న భోజనం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రస్తుతం వర్షాలతో పంటలకు ఎలాంటి నష్టం లేదని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో పంటలు, ఇళ్ల నష్టం తదితర పరిస్థితులను పరిశీలించి నష్టం ఉంటే వెంటనే నివేదించాలని కలెక్టర్ సూచించారు.

అధికారులు హెడ్క్వార్టర్లలో అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో గోదావరి వరదల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని సమాచారం అందించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు..

# రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

**రైతులకు మెరుగైన సేవలే పీఏసీఎస్ పాలకవర్గం లక్ష్యం కావాలి**

**రూ.110 కోట్లతో తాండూరుకు శాశ్వత తాగునీటి పరిష్కారం**

**- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**



**తాండూరు అక్షిత ప్రతినిధి:** రైతుల సంక్షేమానికి ప్రాధా న్యతనిస్తూ, పీఏసీఎస్ పాలకవర్గాలు సమర్థ వంతంగా పనిచేయాలని, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు లోని సల్లా గార్డెన్స్‌లో ఎల్మకన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజ రయ్యారు.

చైర్మన్‌గా జనార్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా రాము బాధ్యతలు స్వీకరించడంతో పాటు నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభా కాంక్షలు తెలిపారు. రైతు లకు మెరుగైన సేవలు అందిస్తూ, సొసైటీకి మంచి పేరు తీసుకురావాలని, ఎమ్మెల్యే సూచించారు.

పీఏసీఎస్ రికార్డులను డిజిటలైజ్ చేసి, రైతుల అవసరాలకు అనుగుణంగా రుణాలు అందిస్తున్నామని, ఎమ్మెల్యే తెలిపారు. కోట్పల్లి, జుంటుపల్లి, శ్రీరాముల ప్రాజెక్టులను అభివృద్ధి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, చెప్పారు. కాగ్నా నది నుంచి తాండూరుకు రూ.110 కోట్లతో తాగునీరు అందించే ప్రణాళికపై సన్నాహాలు జరుగుతున్నాయని, భవిష్యత్‌లో శాశ్వత తాగు నీటి పరిష్కారం కల్పిస్తా మని, పేర్కొన్నారు.

ఏడాది లోపు అన్ని మండలాల్లో అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని, ఎమ్మెల్యే తెలిపారు. తాండూరు అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, నాయకులు సమష్టిగా కృషి చేయాలని, పిలుపు నిచ్చారు. ఈ కార్య క్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# లింగాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం

**విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన విద్య**
**పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే మంగమ్మ**



**నాగర్ కర్నూల్ , అక్షిత ప్రతినిధి:** లింగాల మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సరిపడ్డ వసతులతో కూడిన విద్య అందించడం జరుగుతుందని పాఠశాల హెచ్ఎం కే మంగమ్మ అన్నారు. శుక్రవారం అక్షిత జాతీయ దినపత్రికతో వారు మాట్లాడుతూ పాఠశాలలో మొత్తం 290 మంది విద్యార్థులు కలరు. ఇందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 41 విద్యార్థులు ప్రతిరోజు వెళ్లి విద్యలు అభ్యసించి సాయంత్రం వేళలో హాస్టల్లోనే బసచేస్తారు. విద్యార్థులకు ప్రభుత్వ నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం, ఉదయం టిఫిన్, రాత్రివేళ భోజనం అందజేయడం జరుగుతుంది. విద్యార్థుల కు ప్రతిరోజు పాఠంశాలు బోధించడానికి ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొంటూ విద్య బోధిస్తున్నారు. ప్రభుత్వ నుండి ఉచిత బట్టలు. పెట్టెలు. దుప్పట్లు. ఉచిత నోట్ బుక్కులు. పాఠ్యపుస్తకాలు.మంచాలు అందజేయడం జరిగింది. ప్రతి ఏట విద్యార్థులు పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధిస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలో ఏమైనా కార్యక్రమాలు జరిగినప్పుడు ఎంతో చక్కగా సంస్కృతి కార్యక్రమాల లో పాల్గొంటారు. విద్యార్థుల తల్లిదండ్రుల పేరెంట్స్ సమావేశం. విద్యార్థులు డ్రాప్ ఓటు కాకుండా ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ వస్తున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంతో తల్లిదండ్రులు సందర్శించి చూసినప్పుడు ప్రభుత్వ విద్యార్థులకు ఈ విధంగా మెనూ ప్రకారం పెడుతున్నారా అని తల్లిదండ్రులు ఆశాభ వ్యక్తం చేస్తున్నారు.

# మార్మోగిన వందేమాతరం గీతాలాపన

**ఇచ్చోడ అక్షిత న్యూస్:** 150 ఏళ్ల ప్రస్థానానికి ఘన నివాళి.. 1200 వందల మందికి పైగా విద్యార్థులతో సామూ హిక గీతాలాపన. దేశభక్తి, జాతీయ సమైక్య తకు ప్రతీకగా నిలిచిన 'వందేమాతరం' గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఇచ్చోడ





మండల కేంద్రంతో పాటు అడేగామ (బీ) ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలలో సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఒకే సమయంలో వేలాది గొంతులు ఏకమై 'వందే మాతరం' అంటూ ఆలపించ డంతో దేశభక్తి నినాదాలతో మార్మోగింది. విద్యార్థులు, నాయకులు, యువత జాతీయ జెండాలతో పాల్గొని జాతీయ సమైక్యత, దేశభక్తి సందేశాన్ని చాటారు. వందేమాతరం గీతం దేశ స్వాతంత్ర్యోద్యమంలో ప్రజ ల్లో స్ఫూర్తిని నింపిన చారిత్రక గీతమని నిర్వాహకు లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు విద్యార్థుల కు దేశభక్తి, జాతీయ సమైక్యత, బాధ్యతాయుత పౌరసత్వంపై అవగాహన కల్పించారు. 1200 మంది విద్యార్థులతో వందేమాతరం గీతాఫలన చేసి గిన్నిస్ బుక్ రికార్డ్ కోసం ధ్రువపత్రాలను పంపడం జరిగిందనీ సంబంధిత నిర్వ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడేగామ (బీ) సర్పంచ్ కదం విశాల్, ప్రిన్సిపల్ ఉత్త మ్ దాస్, గీతంజలి, రోజారాణి, బాబారావ్ పాటిల్, ఆమ్టే, ఒరగంటి ఇస్తారి, కాట్పెల్లి నారాయణ రెడ్డి, పిల్లి నరేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ఎంపీపీ నాలిక యాదగిరి మృతి

**- సర్పంచ్, ఎంపీపీ, సొసైటీ డైరెక్టర్ గా సేవలు**

**- టీడీపీ, బీఆర్ఎస్ పార్టీల్లో క్రియా శీలక పాత్రా**

**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** అనారోగ్యం కారణంగా ఉమ్మడి శామీర్‌పేట్ మండల మాజీ ఎంపీపీ నాలిక యాదగిరి శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. దేవరయాంజాల్ లోని తన ఇంటివద్ద యాదగిరి పార్థీవ దేహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ పార్టీ లో క్రియాశీలక నేతగా ఉంటూ, దేవరయాంజాల్ సర్పంచ్ గా, ఉమ్మడి శామీర్ పేట్ మండల ఎంపీపీ గా, ఉమ్మడి శామీర్ పేట్ మండల టీడీపీ అధ్యక్షునిగా నాలిక యాదగిరి ఎన్నో సేవ కార్యక్రమాలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాతా బీఆర్ఎస్ పార్టీ లో చేరి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. బీఆర్ఎస్ పార్టీ లో ఉంటూ ప్రస్తుతం అల్వాల్ సొసైటీ డైరెక్టర్ గా సేవలందించారు. దేవరయాంజాల్ తో పాటు ఉమ్మడి శామీర్‌పేట్ మండల ప్రజలకు నాలిక యాదగిరి అందించిన సేవలు చిరస్మరణీయమని, ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన కృషి అభినందనీయమని పలువురు నాయకులు కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రి తూళ్ల దేవేందర్ గౌడ్ లతో సన్నిహితంగా ఉంటూ ఉమ్మడి శామీర్ పేట్ మండల అభివృద్ధికి తన మార్కును చూపించారు. ఆయన మరణం దేవరయాంజాల్, ఉమ్మడి శామీర్‌పేట్ మండల ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**నివాళులర్పించిన పలువురు నాయకులు**

ఉమ్మడి శామీర్‌పేట్ మండల మాజీ ఎంపీపీ నాలుక యాదగిరి అనారోగ్యంతో మృతి చెందడంతో దేవరయాంజాల్ లోని తన నివాసంలో ఉంచిన పార్థీవ దేహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు.

నాలిక యాదగిరి పార్థీవ దేహానికి నివాళులర్పించిన వారిలో మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఆర్టీఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, ఉమ్మడి శామీర్ పేట్ మండల మాజీ ఎంపీపీ బొల్లబోయిన చంద్రశేఖర్ యాదవ్, దేవరయాంజాల్ మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీను, శామీర్ పేట్ మాజీ ఎంపీటీసీ డప్పు సాయి బాబా, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు ఉన్నారు.



# పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సేవలు, సిద్ధాంతాలు స్ఫూర్తిదాయకం

**- నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ అక్షిత న్యూస్:** సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా అంత్యోదయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, సమాజంలోని ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత మేధావి, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సేవలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారి జయంతిని పురస్కరించుకొని కరీంనగర్ నగరంలోని పార్లమెంట్ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ సిద్ధాంతాలు సమాజంలోని ప్రతి వర్గం సమగ్ర అభివృద్ధికి దోహదపడే గొప్ప ఆలోచనా విధానాలని పేర్కొన్నారు. దేశంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలన్నదే ఆయన ఆశయమని తెలిపారు.దేశ సేవ, సమాజ సేవ పట్ల పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చూపిన అంకితభావం, నిస్వార్థ సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మేయర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కి ఘన నివాళులు అర్పించారు.

# చెంచుల సమస్యలు తెలుసుకున్న కేస్ -సంస్థ హైదరాబాద్ ప్రతినిధులు

**- గ్రామ సర్పంచ్ శ్రీశైలం**



**నాగర్ కర్నూల్ , అక్షిత ప్రతినిధి:** లింగాల మండల పరిధిలోని శ్రీరంగాపూర్ గ్రామపంచాయతీ సమీపంలో ఎర్రపెంట గ్రామంలో చెంచుల యొక్క సమస్య ల ను తెలుసుకోవడం గురించి కేస్ – సంస్థ హైదరాబాద్ వారు టీం గ్రామానికి వచ్చి డోర్ టూ డోర్ సర్వే చేయడం జరిగింది. ఇందులో ప్రభుత్వం పథకాలు, ప్రైవేటు సంస్థల పథకాలు, మొదలగు సేవా కార్యక్రమాల గురించి గ్రామ ప్రజలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఇందులో కేస్ హైదరా బాద్ టీం మరియు గ్రామ సర్పంచ్ శ్రీశైలం మొదలగువారు హాజరు కావడం జరిగింది.

# దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గుంజ రేణుక నారాయణ

**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంటెస్ట్ కార్పొరేటర్ . మంజల రమేష్ తండ్రి మంజుల పెద్ద తిమ్మయ్య దశదిన కర్మ కార్యక్రమం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని, ఐడిఏ గాంధీనగర్ లో గల



ఎన్ ఆర్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సందర్భంగా ఈ దశదిన కర్మ కార్యక్రమంలో తెలంగాణ వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గుంజ రేణుక నారాయణ, డిసిసి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం శేరిలింగంపల్లి నియోజక వర్గం అధ్యక్షులు ముద్దంగుల తిరుపతి ముఖ్య అతిథులుగా పాల్గొని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ మంజల పెద్ద తిమ్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంజుల రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం ప్రతినిధులు, నాయకులు, నాయకురాళ్ళు కుల బంధువులు, వివిధ పార్టీల ప్రతినిధులు, వివిధ కాలనీలా వాసులు పాల్గొని స్వర్గీయ మంజల పెద్ద తిమ్మయ్య కు నివాళులు అర్పించారు.

# దాతృత్వం చాటుకున్న పంతంగి గ్రామ సర్పంచ్

**బర్మ జంగయ్యకు 1,500 ఆర్థిక సహాయం అందజేత**



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** చౌటుప్పల్ మండలం, పంతంగి గ్రామ సర్పంచ్ కాకి శ్రీలత సుందర్ పంతంగి గ్రామానికి చెందిన వృద్ధుడు బర్మ జంగయ్య కు ప్రభుత్వ వృద్ధాప్య పింఛన్ అందేంతవరకు ప్రతినెల 1500 రూపాయల ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు గత మూడు నెలలుగా బర్మ జంగయ్య కు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నాలుగో నెల 1500 రూపాయల పింఛన్‌ను అందజేసి తన దాతృత్వాన్ని చాటుకు న్నారు. వృద్ధులకు అండగా నిలుస్తూ మానవ దృక్పథంతో సహాయం చేస్తున్న గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్ ను గ్రామస్తులు అభినందించారు.

# పనికోసం ఇంటినుండి వెళ్ళిన యువతి అదృశ్యం



**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** రోజూ లాగే ఇంటి నుండి పనికోసామని వెళ్ళిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధి మజీద్ పూర్ లో చోటు చేసుకుంది. జీనోమ్ వ్యాలీ సీఐ గురవయ్య తెలిపిన వివరాల ప్రకారం మజీద్ పూర్ లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్న కీర్తన (19) రావల్ కోల్ లోని నర్సరీలో గత 4 నెలలుగా ఉద్యోగం చేసుకుంటుంది. కాగా ఈ నెల 23న ఉదయం పనికోసం రోజులాగే ఇంటినుండి వెళ్లి తిరిగి రాలేదని బంధువులు చెప్పారని తెలిపారు. యువతి అదృశ్యమైన రోజున లైట్ బ్లూ కలర్ టాప్, బ్లూగ్ లాగిన్, బ్లాక్ చున్నీ ధరించి ఉందని, 4.8 అడుగుల ఎత్తు ఉంటుందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. యువతి ఆచూకీ తెలిసిన వారు జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలని సూచించారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY


# వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణ, హక్కులపై విస్తృత అవగాహన కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి**

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా 'ఎల్డర్ గైడ్' అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణ, భద్రత, హక్కులపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు.

శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు వారం రోజుల పాటు నిర్వహించే వయోవృద్ధుల వారోత్సవాల, లో భాగముగా వయోవృద్ధుల సంక్షేమం, వారి హక్కులు, ప్రభుత్వ సేవలు, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించే పోస్టర్లతో పాటు 'ఎల్డర్ గైడ్' పోస్టర్లను అదనపు కలెక్టర్ దేవ సహాయం, డీఆర్వో పాండు, డీపీఓ శ్రీరాములు, పీడీ డీఆర్డీఏ చిన్న ఓబులేసుతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వృద్ధులు



ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంరక్షణ, భద్రత, సంక్షేమం, చట్టబద్ధమైన హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వృద్ధులను గౌరవంగా చూసుకోవడం, వారి అవసరాలను గుర్తించి తగిన సహాయ సహకారాలు అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. వృద్ధులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలు, పథకాలు, సంక్షేమ కార్యక్రమాల వివరాలను వారికి చేరవేయడంలో 'ఎల్డర్ గైడ్' ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

వారం రోజుల పాటు కార్యక్రమాలు

సెప్టెంబర్ 24: వృద్ధుల శ్రేయస్సు, సాధికారత వారోత్సవాల ప్రారంభం, పోస్టర్ల ఆవిష్కరణ.

సెప్టెంబర్ 25: వృద్ధుల ఆరోగ్య, సంరక్షణ దినోత్సవం - వృద్ధాశ్రమాలలో వినోద కార్యక్రమాలు, ఇండోర్ ఆటలు.

సెప్టెంబర్ 26: వృద్ధాశ్రమాల సామర్థ్య పెంపు - సిబ్బందికి కనీస ప్రమాణాలు, సంరక్షణపై శిక్షణ మరియు తనిఖీలు.

సెప్టెంబర్ 28: సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత - వృద్ధులపై వేధింపులు, మోసాలు, దోపిడీల నివారణపై అవగాహన.

సెప్టెంబర్ 29: తరాల మధ్య అనుబంధం - పాఠశాలల్లో విద్యార్థులు, వారి తాతా-బామ్మలతో కలిసి ఆత్మీయ కలయికలు.

సెప్టెంబర్ 30: యాక్టివ్ ఏజింగ్, వెల్‌నెస్ మరియు ఇంటర్-జనరేషనల్ వాకథాన్.

అక్టోబర్ 01: జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహణ.

ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీఓ రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిమర్జనం ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ యువరాజ్ మర్మాట్

**ఆసిఫాబాద్ అక్షిత బ్యూరో:** నిమర్జనోత్సవాల సందర్భంగా శుక్రవారం అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ సబ్ కలెక్టర్‌తో కలిసి నేడు స్థానిక విగ్రహాల నిమర్జనం పాయింట్ ఘాటు ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ తనిఖీలో భాగంగా అధికారులు భద్రత రక్షణ, పరిశుభ్రత, విద్యుత్ దీపాలు, బారికేడ్ ఏర్పాట్లు ట్రాఫిక్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను క్షుణ్ణంగా సమీక్షించారు.

అడిషనల్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ చేసిన మాట్లాడుతూ..

**ప్రజా రక్షణ:** అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు నిమర్జనం పాయింట్ వద్ద ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**విద్యుత్ & మౌలిక వసతులు:** నిమర్జన ఘాట్లు వద్ద, ప్రధాన మార్గాల్లో ఎలాంటి అంతరాయం లేని హై-మాస్ట్ విద్యుత్



దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

**పరిశుభ్రత, తాగునీరు:** స్థానిక మునిసిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని, భక్తుల కోసం తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని తెలిపారు.

**ట్రాఫిక్ నియంత్రణ:** రద్దీని నివారించేందుకు బారికేడింగ్ మరియు వాహనాల పార్కింగ్ స్థలాలను స్పష్టంగా కేటాయించాలని పోలీసు, రెవెన్యూ శాఖలను ఆదేశించారు.

ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, విద్యుత్ మరియు ఆరోగ్య శాఖల సమన్వయంతో నిమర్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా ముగిసేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ఉన్నతాధికారుల సూచనల మేరకు అన్ని ఏర్పాట్లను శరవేగంగా పూర్తి చేస్తున్నామని, నిమర్జనం ముగిసే వరకు ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, మున్సిపల్ సిబ్బంది మరియు స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మియాపూర్‌లో వినాయక చవితి ముగింపు వేడుకలు

**అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న జగదీశ్వర్ గౌడ్, యలమంచి ఉదయ్ కిరణ్..**

**మియాపూర్,అక్షితప్రతినిధి:** మియాపూర్ పరిధిలోని దత్త సాయి కాలనీ, నడిగడ్డ తండా, ఆరోబిందో కాలనీలలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక వాతావరణం మరియు ఉత్సాహభరిత కార్యక్రమాల మధ్య ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీ పి సి సి జనరల్ సెక్రటరీ వి.జగదీశ్వర్ గౌడ్ , అలాగే మియాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యలమంచి ఉదయ్ కిరణ్ , వ్యవస్థాపకులు చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్, ఆయా ఉత్సవ కమిటీల మరియు సంఘాల ఆహ్వానం మేరకు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీ వినాయక స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం మరియు సర్వశ్రేయస్సు కలగాలని శ్రీ వినాయక స్వామివారిని ప్రార్థించారు. దత్త సాయి కాలనీ గణేష్ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు వేడుకల్లో ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ రవి కృష్ణ, సురేష్, మారుతి, నాగేశ్వరావు తదితరులు అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించి ఆత్మీయంగా స్వాగతించారు. కార్యక్రమంలో విజయ భాస్కర్ రెడ్డి, మూర్తి, రవి, శంకర్, మధు, ప్రణీత్, వంశీ, ప్రవీణ్ తదితరులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువత, స్థానిక నివాసితులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మయూరి నగర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డ తండాలో నడిగడ్డ తండా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగాయి. ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమాన్ని లక్ష్మణ్, శంకర్, శివ, సచిన్, సుమన్, దేవేందర్, సాయి కుమార్ మరియు వారి మిత్రబృందం



సమన్వయంతో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో విజయ భాస్కర్ రెడ్డి, మూర్తి, శంకర్, మధు, వంశీ, ప్రణీత్, ప్రవీణ్, గురువులు తదితరులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువత, స్థానిక నివాసితులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆరోబిందో కాలనీలో వినాయక చవితి ఉత్సవాల ముగింపు వేడుకలు భక్తి, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. శ్రీ వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆరోబిందో గణేష్ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో లోకేష్, రమేష్, సురేష్ మరియు కమిటీ సభ్యులు అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించి స్వాగతించారు. ఈ కార్యక్రమం లో ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువత, స్థానిక నివాసితులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .

# ఉచిత వృత్తి విద్యా శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు

**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మందమర్రి ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు, యువత స్వయం ఉపాధి పొందేందుకు నిర్వహించనున్న ఉచిత వృత్తి విద్యా శిక్షణ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ గడువును అక్టోబర్ 1వ తేదీ వరకు పొడిగించినట్లు డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్ తెలిపారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మూడు నెలలపాటు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో, రెండు నెలలపాటు కంప్యూటర్ డీటీపీ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గనుల కారణంగా భూములు కోల్పోయిన భూ నిర్వాసితుల భార్యలు, వారి పిల్లలు, మందమర్రి ఏరియా సింగరేణి ప్రస్తుత, మాజీ కార్మికుల భార్యలు, వారి పిల్లలు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. అలాగే కేకే ఓసీపీ, ఆర్కే ఓసీపీ ప్రాజెక్టుల పరిసర ప్రాంతాలతోపాటు బెల్లంపల్లి, కాసిపేట, సోమగూడెం, మందమర్రి, రామకృష్ణాపూర్ పరిసర గ్రామాలకు చెందిన మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను మందమర్రిలోని జీఎం కార్యాలయంలో ఉన్న జీఎం పీఏ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తులతోపాటు ఎస్ఎస్‌సీ మెమో, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో జత చేయాలని, సింగరేణి ఉద్యోగి లేదా మాజీ కార్మికుల కుటుంబ సభ్యులైతే సంబంధిత ఐడెంటిటీ కార్డు జత చేయాలని తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 01 అక్టోబర్ 2026 అని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 7032878575 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్ సూచించారు.

# రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ క్రీడలకు త్రినిటి పాఠశాల విద్యార్థులు ఎంపిక

**చౌటుప్పల్/అక్షిత న్యూస్:** చౌటుప్పల్ పట్టణంలోని త్రినిటీ పాఠశాలకు చెందిన విద్యార్థులు కట్టంగూర్ మండలం, చెరువు అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్జీఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ కెవిబి కృష్ణారావు, ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ ఉజ్జిని మంజుల తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు అండర్ 14 బాలికల విభాగంలో జి.ప్రేక్ష, కె.ఆకాంక్ష,

అండర్ 14 బాలుర విభాగంలో పి జ్ఞానేశ్, సూర్య ప్రకాష్,



అండర్ 17 బాలుర విభాగం లో బి.పవన్ కుమార్, అండర్ 17 బాలికల విభాగంలో జి.హర్షిత ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడ పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు సందీప్, నందిని లను చైర్మన్ కృష్ణారావు, ప్రిన్సిపల్ మంజుల ప్రత్యేకంగా అభినందించి రాష్ట్రస్థాయి క్రీడలో విజయం సాధించి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# వానాకాలం మరి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** 2026-27 వానకాలం సీజన్ వరి ధాన్యం కొనుగోలు కొరకు కొనుగోలు కేంద్రాలలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ పవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, ఆసిఫాబాద్



రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి వరి ధాన్యం కొనుగోలు, కొనుగోలు కేంద్రాలలో ఏర్పాట్లపై వ్యవసాయ విస్తరణ అధికారులు, సహకార శాఖ, ఐ. కె. పి. సిబ్బంది, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ వానాకాలం సీజన్ లో 23 వేల 900 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, అక్టోబర్ 1 తేదీన జిల్లాలో అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులు, త్రాగునీరు, నీడ, వెలుతురు ఉండేలా, కొనుగోలు కేంద్రాలను ఎత్తైన చదును ప్రదేశాలలో, రహదారికి దగ్గరగా వాహనాలు వెళ్లేలా గుర్తించాలని తెలిపారు.. సరిపడా గోనె సంచులు, ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్ కవర్లు, డ్రయర్లు ఉండేలా, ప్రతి కొనుగోలు కేంద్రంలో 2 ఎలక్ట్రానిక్ టూ కం యంత్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా హమాలీలను అందుబాటులో ఉంచాలని, 17 శాతం లోపు తేమ ఉండేలా, తాలు, దుమ్ము లేకుండా రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలని, క్రమ పద్ధతిలో ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. టూకం వేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైతు మిల్లులకు తరలించాలని, వరి ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన గోదాములను సిద్ధం చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో వసతులు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, ప్యాడి క్లీనర్లు, డ్రయర్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, మద్దతు ధర, సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ వంటి వివరాలు రైతులకు తెలిసే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేసి కొనుగోలు చేపట్టాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, జిల్లా పౌర సరఫరాల అధికారి వాజీద్, జిల్లా సహకార అధికారి, ఐ కె పి ఎ.పి.ఎం.లు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు వ్యవసాయ విస్తరణ అధికారులకు సంబం ధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కెజిబివి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** పెనుబల్లి మండలం ఉప్పల చిలకలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి) పాఠశాల, కళాశాలను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టారాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థినులతో కొంతసేపు గడిపారు. హాస్టల్ గదులు, తరగతి గదులు, హాస్టల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనం మెనూ ప్రకారం అందుతున్నదా? ఆహారం నాణ్యత ఎలా ఉంది అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.స్వతహాగా





వైద్యురాలైన ఎమ్మెల్యే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని విద్యార్థినులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు.

హాస్టల్ ప్రాంగణంలో చెత్త పేరుకుపోకుండా,నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, దిశ కమిటీ సభ్యులు కిషోర్ పోతురాజు,మండల కాంగ్రెస్ నాయకులు, సంబంధిత సిబ్బందితదితరులుపాల్గొన్నారు.



# తరంగ్-2 పర్వతంపై తొలి భారతీయబృందం అధిరోహణ

**బృందంలో తెలంగాణ ఖమ్మం జిల్లాకు చెందిన బర్మావత్ మోతి కుమార్**

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** హిమాచల్‌ప్రదేశ్‌లోని మియార్ వ్యాలీ ప్రాంతంలో సముద్ర మట్టానికి సుమారు 6,021 మీటర్ల ఎత్తులో ఉన్న తరంగ్-2 (శైలపుత్రి) పర్వతాన్ని తొలి భారతీయ బృందం అధిరోహించి రికార్డు సృష్టించింది. 10 మంది సభ్యులతో కూడినఈబృందంలో తెలంగాణకుచెందినపర్వతారోహకులు కూడా ఉన్నారు. వారిలో ఖమ్మం జిల్లాకు చెందిన బర్మావత్ మోతి కుమార్ ప్రత్యేకంగా నిలిచారు.



హైదరాబాద్ కేంద్రంగా పర్వతారోహణకు శిక్షణ అందించే ట్రాన్స్‌ఎండ్ అడ్వెంచర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ పర్వతారోహణ చేపట్టారు. పర్వతం దిగువ ప్రాంతంలోని బేస్ క్యాంపు నుంచి ఈ నెల 11వ తేదీన నైరుతి మార్గంలో బృందం ట్రెక్కింగ్ ప్రారంభించింది. అనంతరం 22వ తేదీసాయంత్రం 4:30 గంటలకుతరంగ్-2పర్వత శిఖరాగ్రానికి చేరుకుని విజయవంతంగాఅధిరోహించింది. అంతేకాకుండా ఈపర్వతంపైకి కొత్త మార్గాన్ని ఏర్పాటు చేసిన ఘనత కూడా ఈ బృందానికి దక్కింది. శైలపుత్రి అని పిలిచే తరంగ్-2పర్వతంహిమనదులు, నిటారుగా ఉండేశిలా పర్వతాలు, క్లిష్టమైన మంచు మార్గాలతో పర్వతారోహకులకు సవాలుగా నిలుస్తుంది. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం 2016 అక్టోబర్ 1న బ్రిటిష్, స్వీడిష్ బృందం ఈ పర్వతాన్ని అధిరోహించింది. అయితే భారతీయుల బృందం ఈ పర్వతాన్ని అధిరోహించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ బృందంలో తెలంగాణకు చెందిన బర్మావత్ మోతి కుమార్ (ఖమ్మం), నందిగామరాజ్‌కుమార్,విస్తావత్ బన్నీ(నిజామాబాద్) తో పాటు హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన పర్వతారోహకులు పాల్గొన్నారు.

బర్మావత్ మోతి కుమార్ ఖమ్మం జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ పర్వతారోహకుడు. ఇప్పటికే పలు ఎత్తైన పర్వతాలను అధిరోహించిన ఆయన, తరంగ్-2 పర్వతారోహణలో కూడా పాల్గొని భారత జాతీయ జెండాను ఎత్తైన శిఖరంపైకి తీసుకెళ్లే లక్ష్యంతో యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు.

# త్రినిటీ పాఠశాలలో వందేమాతర గీతాలాపన

**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** వందేమాతర గీతం రచించి 150 సంవత్సరములు పూర్తి అయిన సందర్భంగా ప్రతి పౌరుడు వందేమాతర జాతీయ గీతాన్ని భాగాలుగా కాకుండా పూర్తిగా నేర్చుకొని ఆలపించాలనే సదుద్దేశంతో త్రినిటీ విద్యాసంస్థలు శుక్రవారం నుండి ప్రతి విద్యార్థులకు కంఠస్థపరచి మన దేశ ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని, వనరులను, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఈ గేయ అర్థాలను కులంకుశంగా అభ్యసించేటట్లు చేయాలనే దృఢ సంకల్పంతో మొదలుపెట్టి ప్రారంభించినట్లు త్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీపీ కృష్ణారావు




తెలిపారు. శుక్రవారం నుండి ప్రతి ఉదయం పాఠశాల యందు వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రినిటీ విద్యాసంస్థల ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల, త్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీపీ కృష్ణారావు, సమన్వయకర్తలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు చేర్యాల గురుకుల విద్యార్థులు

**చేర్యాల అక్షిత ప్రతినిధి:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ బి14 కబడ్డీ పోటీలలో చేర్యాల తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయానికి చెందిన విద్యార్థులు కబడ్డీ విభాగంలో ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచారు.సిద్దిపేట జిల్లా కేంద్రంలోని స్టేడియంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొని చేర్యాల గురుకుల విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రతిభ



కనబరిచారు. నితిన్, విశాల్, జోసెఫ్, జోషి జట్టులో పాల్గొని విజయానికి కృషి చేశారు. వీరిలో నితిన్ ఉమ్మడి జిల్లా స్థాయి జట్టుకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ పోలోజ్ నరసింహ చారి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు విజేత విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు శిక్షణ అందించిన ఫిజికల్ డైరెక్టర్ సురేష్,పి.ఈ.టి. రేణుక లను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

# జిల్లా ఖజానా అధికారిగా ఇన్చార్జి బాధ్యతలు స్వీకరించిన హమిద్సా ఖాన్

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** జిల్లా ఖజానా శాఖ అధికారిగా పెద్దపల్లి జిల్లా మంథని డివిజన్ ఖజానా కార్యాలయంలో సహాయ ఖజానా అధికారిగా పనిచేస్తున్న హమిద్సా ఖాన్ ను డిప్యూటేషన్ పై జిల్లా ఖజానా అధికారిగా రాష్ట్ర ట్రెజరీ శాఖ సంచాలకులు నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం ఇంచార్జ్ గా పూర్తి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ఖజానా అధికారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ బిల్లుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అధికారికి కార్యాలయ అధికారులు ఉద్యోగులు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY


## నేడు లింగాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

**- మండల విద్యాధికారి బషీర్ అహ్మద్**

**నాగర్ కర్నూల్ , అక్షిత ప్రతినిధి:** విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే ఉద్దేశంతో పాలమూరు ఎన్ ఆర్ ఐ ఫోరం ఆధ్వర్యంలో తేది:26-09-2026 శనివారం ఉదయం10 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగాలలో మండల స్థాయి పరీక్ష 5నుండి10 తరగతుల తెలుగు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు తెలుగు ఇంగ్లీష్ గణితం సబ్జెక్టులకు సంబంధించి ఆగస్టు నెల పాఠ్యాంశాల వరకు పరీక్షించడం జరుగుతుందని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి తరగతి నుండి ముగ్గురు పరీక్షకు హాజరు కావాలి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు 300 రూపాయల నగదు మెడల్ అలాగే ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులకు రెండు వందల రూపాయల నగదు మెడల్ మరియు ప్రశంసా పత్రం ఇవ్వడం జరుగుతుంది మండలంలోని అన్ని విభాగాల పాఠశాలలో పరీక్షలో పాల్గొనగలరు మండలం విద్యాధికారి శ్రీ బషీర్ అహ్మద్ తెలపడం జరిగింది.

## ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్

**ఈ నెల 27న రాయికల్ లోని 'శ్రీ చెన్నకేశవనాథ ఆలయం' లో వేడుకలు**

**జగిత్యాల అక్షితబ్యూరో:** 'ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని' పురస్కరించుకొని ఈ నెల 27న జగిత్యాల జిల్లాలోని రాయికల్ గ్రామం, మండలంలోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం) లో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక రంగం ప్రాధాన్యత, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడి, సుస్థిర అభివృద్ధిలో పర్యాటక రంగం పోషించే కీలక పాత్ర పై ప్రజల్లో




అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు

2026 సంవత్సరానికి "డిజిటల్ అజెండా మరియు కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగం పునర్ రూపకల్పన" అనే థీమ్‌ను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల విశిష్టతను ప్రజలకు తెలియజేస్తూ పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## గణపయ్య నిమజ్జనం.. స్కూటీ బహుమతి!

**ముదిరాజ్ యూత్ లక్కీడ్రాలో వికాస్‌కు అదృష్టం...**

**లోకేశ్వరం, సెప్టెంబర్ 25 అక్షిత న్యూస్:**

నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల కేంద్రంలో ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో 11 రోజులుగా నిర్వహించిన గణేశ్ ఉత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ ప్రత్యేక పూజల అనంతరం గణనాథుడి నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ యువత, మహిళలు, చిన్నారులు,పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.



నిమజ్జన వేడుకల సందర్భంగా ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్కీ డ్రా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.గ్రామ సర్పంచ్ ధర్వాడి కపిల్,ముదిరాజ్ యూత్ సభ్యులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో డ్రా నిర్వహించారు. ప్రథమ బహుమతిగా అంబకంటి గ్రామానికి చెందిన వికాస్‌కు ఎలక్ట్రిక్ స్కూటీ లభించింది. ఇతర బహుమతుల్లో రైస్ కుక్కర్‌ను మంచిర్యాలకు చెందిన అద్వైత, ప్రెజర్ కుక్కర్‌ను దుర్గానగర్‌కు చెందిన అర్చన,సీలింగ్ ఫ్యాన్‌ను లక్ష్మీ ముత్తవ్వ,డిన్నర్ సెట్‌ను సంజన గెలుచుకున్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేసి అభినందించారు. గణేశ్ నిమజ్జన వేడుకలు,లక్కీ డ్రా కార్యక్రమంలో ముదిరాజ్ యూత్ సభ్యులు,గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు..

## వినాయక నిమజ్జనోత్సవాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల అక్షితబ్యూరో:** శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా, ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి.

ఈ నేపథ్యంలో జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు వద్ద నిమజ్జనోత్సవాల తీరును జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. పట్టణంలో అత్యధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు చింతకుంట చెరువు వైపు తరలి వెళ్తున్నాయి.నిమజ్జనాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టిందిని తెలిపారు. విగ్రహాలను తీసుకొచ్చే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్గాలను పర్యవేక్షించడంతో పాటు నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.



చెరువు వద్ద నిమజ్జన కేంద్రాలను సిద్ధం చేశారు. భక్తులు, ఉత్సవ కమిటీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, విద్యుత్, లైటింగ్ తదితర ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, మున్సిపాలిటీలు, విద్యుత్ శాఖ సమన్వయంతో పని చేయడంతో నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగుతున్నాయి . ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో గణనాథులకు వీడ్కోలు పలుకుతున్నారని అన్నారు. భక్తి, ఉత్సాహం, క్రమశిక్షణతో సాగిన నిమజ్జనోత్సవాలతో జిల్లా మరోసారి గణేశ్ ఉత్సవాల వైభవాన్ని చాటుతుందన్నారు

ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, తహసీల్దార్ రామ్ మోహన్, సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది, మరియు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్నం భోజనం పరిశీలించిన మండల స్పెషల్ ఆఫీసర్ రవిబాబు




**ఖమ్మం /అక్షిత బ్యూరో:** నేలకొండపల్లి మండలం అనాసాగరం ప్రాథమిక పాఠశాలకు మండల స్పెషల్ ఆఫీసర్ ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి కె రవి బాబు మధ్యాహ్నం భోజనం పరిశీలించి విద్యార్థులను అడిగి మెనూ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం స్కూల్ టాయిలెట్ కిచెన్ గార్డెన్ విద్యార్థిని విద్యార్థులను చదివించడంతోపాటు విద్యార్థుల ప్రతిభను అడిగి తెలుసుకున్నారు. ఖచ్చితంగా మెనూ పాటించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ చలపతిరావు పాఠశాల హెడ్మాస్టర్ కోటేశ్వరావు టీచర్ గోవిందరావు అంగన్వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

## జీ రామ్‌జీ పథకం అమలులో నిబంధనలు



**మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలి,**

**గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో పాటు నీటి వనరుల శాశ్వత ఆస్తుల సృష్టికి ప్రాధాన్యత ఇవ్వాలి,**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:**

నాగర్‌కర్నూల్ జిల్లాలోని 460 గ్రామపంచాయతీల పరిధిలో నూతనంగా అమలు చేస్తున్న విక్షిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్-జీ రామ్‌జీ పథకం ద్వారా చేపట్టనున్న పనులు, పథకం అమలుకు సంబంధించిన విధి విధానాలు, మార్గదర్శకాలపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, జిల్లాలోని 460 గ్రామపంచాయతీల కార్యదర్శులకు, సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించేందుకు శుక్రవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., జీ రామ్‌జీ పథకం లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, గ్రామాల దీర్ఘకాలిక అభివృద్ధికి దోహదపడే శాశ్వత ఆస్తులు, మౌలిక వసతుల కల్పనకు నీకు వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పనులను గుర్తించి చేపట్టాలని ఆదేశించారు.

గ్రామాల స్థానిక అవసరాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. పథకం మార్గదర్శకాలకు అనుగుణంగా పనుల ఎంపిక, ప్రణాళిక రూపకల్పన, పరిపాలనా మరియు సాంకేతిక అనుమతులు, పనుల అమలు, పర్యవేక్షణ తదితర ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహించాలని స్పష్టం చేశారు.

పథకం కింద చేపట్టే పనుల విషయంలో పారదర్శకత, జవాబుదారీతనం, నాణ్యత, సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తయ్యేలా సంబంధిత అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

గ్రామపంచాయతీ స్థాయిలో చేపట్టే పనులకు సంబంధించి అవసరమైన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పాటు, పథకం అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడం మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా స్థిరమైన గ్రామీణ మౌలిక వసతులు, నీటి వనరుల శాశ్వత అభివృద్ధి ఉత్పాదక ఆస్తుల సృష్టిపై దృష్టి సారించాలని తెలిపారు.

మండల, గ్రామపంచాయతీ స్థాయిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది పథకం మార్గదర్శకాలు, పనుల ఎంపిక మరియు అమలు విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో ఎలాంటి సందిగ్ధతలకు తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం జీ రామ్‌జీ పథకం కింద చేపట్టాల్సిన పనుల గుర్తింపు, పనుల ప్రాధాన్యత, అమలు విధానం, సాంకేతిక అంశాలు, పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులు సిబ్బందికి వివరణాత్మకంగా అవగాహన కల్పించారు.

ఈ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ దేవ సహాయం,డిఆర్ఓ పాండు, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు,డిపిఓ శ్రీరాములు, అదనపు డిఆర్డిఓ రాజేశ్వరి, డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, జిల్లాలోని గ్రామపంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్ర పెంట గ్రామంలో శ్రీ కోదండ రామాలయం నిర్మాణ పనులు ప్రారంభం

**తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో.. గ్రామ సర్పంచ్ శ్రీశైలం**

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి సేవా సంస్థ వికాస తరంగిణి ఆధ్వర్యంలో లింగాల మండలం ఎర్ర పెంట గ్రామంలో శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ దేవాలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం పది లక్షల రూపాయలను ఆర్థిక సహకారం అందిస్తోంది. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇంజనీరింగ్ వారి పర్యవేక్షణలో ఈ ఆలయం రూపుదిద్దుకుంటుంది. ఈ ఆలయం నిర్మాణం పూర్తి అయితే గ్రామంలో భజనలు, కోలాటాలు, సత్సంగాలు ,స్వామివారి కళ్యాణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుపుకోవడానికి అనుకూలంగా ఉంటుందని గ్రామస్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ రేణు గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీ కాట్రాజ్




గోవిందు చెంచు పెద్దలు పాల్గొన్నారు. వార్డ్ నెంబర్ బాల్మూరి స్వప్న, కమీటి సభ్యులు బాల్మూరి సన్నయ్య, కాట్రాజు నిరంజన్, బాల్మూరి భయ్యన్న, తిరుగుడు ఇద్దన్న, తిరుగుడు వెంకటయ్య, తిరుగుడు రాములు, కాట్రాజు చిన్నయ్య, కాట్రాజు లింగస్వామి, కాట్రాజు కుర్మయ్య, తిరుగుడు శివకుమార్, నిమ్మల పెంటయ్య, బాల్మూరి లింగస్వామి, దాసారి బాలరాజు, మొదలగు వారు పాల్గొన్నారు.



## అమృత్ 2.0 పనులను వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

**అక్షిత బ్యూరో, మంచిర్యాల:** ప్రజలకు నిరంతరం శుద్ధమైన త్రాగునీటిని అందించే లక్ష్యంతో చేపట్టిన అమృత్ 2.0 పథకం పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకంలో భాగంగా నస్పూర్‌లోని ఆర్కే-6 వద్ద నిర్మిస్తున్న 1 వేయి కిలోలీటర్ల సామర్థ్యం గల ఎలివేటెడ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్, హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మిస్తున్న 1 వేయి 500 కిలోలీటర్ల సామర్థ్యం గల ఈ.ఎల్.ఎస్.ఆర్. నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పనులను నిర్దేశిత ప్రమాణాలు, నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పనులలో జాప్యం లేకుండా అదనపు కార్మికులను సమీకరించి, శ్రామిక బలాన్ని పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన త్రాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అనంతరం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భావన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అధికారులు, ఎల్.పి.జి. డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు ఎల్.పి.జి. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యాచరణ ప్రకారం వినియోగదారుల ఈ-కెవైసి ప్రక్రియను పూర్తి చేయాలని, నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేసేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుంతలమయంగా మారిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి

**పల్లివాడ, మునిపంపుల, దుబ్బాక రోడ్లపై ప్రమాదాల ముప్పు**

**- ఆర్అండ్‌బీ ఈఈకి సర్పంచుల వినతి**

**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట మండలంలోని దుబ్బాక, మునిపంపుల, పల్లివాడ, ఇంద్రపాలనగరం గ్రామాల పరిధిలో గుంతలమయంగా మారిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని కోరుతూ పల్లివాడ, మునిపంపుల తుమ్మలగుడం సర్పంచులు కమ్మంపాటి శ్రీనివాసులు, బొడ్డుపల్లి వెంకటేశం గర్దాసు విక్రం లు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆర్అండ్‌బీ ఈఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లు పూర్తిగా ధ్వంసమై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు, రైతులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడే పరిస్థితి నెలకొందన్నారు. వర్షాల సమయంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ప్రమాదకర



పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో రోడ్లను పరిశీలించి గుంతలను వెంటనే పూడ్చడంతో పాటు అవసరమైన చోట రోడ్డు మరమ్మతులు, పునర్నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించి ప్రజలకు సురక్షితమైన రహదారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## బ్యాంకు సమ్మె నేపథ్యంలో ఖాతాదారులకు ముందస్తు సూచనలు

**- 28 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా సమ్మె**

**- 27న బ్యాంకు శాఖలు పనిచేసేలా చర్యలు**

**యాదాద్రి భువనగిరి అక్షిత బ్యూరో:** తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యు ఎఫ్ బి యు) ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగులు, అధికారులు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకు శాఖల్లో ప్రత్యక్షంగా అందించే సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున ఖాతాదారులు ముందస్తుగా తమ బ్యాంకింగ్ అవసరాలను పూర్తి చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డి. వీరన్న సూచించారు.

**27న ఆదివారం బ్యాంకులు పనిచేస్తాయి**

సమ్మె నేపథ్యంలో ఖాతాదారుల సౌకర్యార్థం ఈ నెల 27వ




తేదీ ఆదివారం బ్యాంకు శాఖలు పనిచేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆర్‌బీఐ అనుమతితో బ్యాంకు శాఖలతో పాటు కరెన్సీ చెస్టులు కూడా ఆ రోజు పనిచేయనున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర నగదు లావాదేవీలు, చెక్కుల క్లియరెన్స్, ఇతర బ్యాంకింగ్ కార్యకలాపాలు అవసరమైన ఖాతాదారులు వీలైనంత వరకు 27వ తేదీ ఆదివారం రోజునే పూర్తి చేసుకోవాలని సూచించారు.

**డిజిటల్ సేవలను వినియోగించుకోవాలి**

సమ్మె సమయంలో శాఖలకు వెళ్లాల్సిన అవసరం లేని బ్యాంకింగ్ లావాదేవీల కోసం ఖాతాదారులు డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. యూపీఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, బ్యాంకుల మొబైల్ యాప్‌లు వంటి సేవలతో పాటు ఏటీఎంల ద్వారా నగదు ఉపసంహరణ వంటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమ్మె కారణంగా ఖాతాదారులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని డి. వీరన్న తెలిపారు. ఖాతాదారులు ముందస్తు ప్రణాళికతో తమ బ్యాంకింగ్ అవసరాలను పూర్తి చేసుకోవాలని కోరారు.

## నిరుద్యోగ యువత ఉద్యోగమేళను సద్వినియోగం చేసుకోవాలి

**ఈనెల 27వ తేదీ తంగడపల్లి జడ్పీహెచ్‌ఎస్ లో ఉద్యోగ మేళా...**

**50కి పైగా కంపెనీలతో భారీ ఉపాధి అవకాశాలు...**

**ఆసరా ఫౌండేషన్ చైర్మన్ బొల్లా శివశంకర్**

**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:**

"యువత ప్రతిభకు అవకాశం... ప్రతి అడుగులో ఆసరా... ప్రతి విజయానికి ప్రోత్సాహం" అనే లక్ష్యంతో ఆసరా ఫౌండేషన్ ముందుకు సాగుతోందని ఫౌండేషన్ చైర్మన్ బొల్లా శివశంకర్ తెలిపారు.నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, వారి ప్రతిభను గుర్తించి సరైన రంగంలో ఉపాధి పొందేలా చేయడం లక్ష్యంగా ఫౌండేషన్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ బొల్ల శివశంకర్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ ఆదివారం మరో ఉద్యోగ మేళా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.యువతకు కేవలం మాటల్లో ప్రోత్సాహం కాకుండా ఉద్యోగ అవకాశాలను వారి వద్దకే తీసుకురావాలనే సంకల్పంతో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు బొల్ల శివశంకర్ తెలిపారు. సెప్టెంబర్ 27వ తేదీ ఆదివారం




ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చౌటుప్పల్ మండలం తంగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ జాబ్ మేళా జరగనుందని,ఈ జాబ్ మేళాలో 50కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ విభాగాల్లో ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయని వారు తెలిపారు. మ్యాను ఫ్యాక్చరింగ్, బీపీఓ, ఐటీ, హెల్త్‌కేర్, బ్యాంకింగ్, రిటైల్, సేల్స్, మార్కెటింగ్ తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉండనున్నాయని,వివిధ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువత తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పొందే అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇట్టి అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చౌటుప్పల్‌నియోజకవర్గ ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న ప్రతి యువకుడు,యువతి తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరై తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు.యువతకు ఉద్యోగం... కుటుంబాలకు ఆర్థిక భరోసా... సమాజానికి అభివృద్ధి అనే లక్ష్యంతో ఆసరా ఫౌండేషన్ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని బొల్ల శివశంకర్ తెలిపారు. భవిష్యత్తులో కూడా యువతకు మరిన్ని ఉద్యోగ, విద్య,ఉపాధి అవకాశాలు అందించే కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు వెల్లడించారు.

Edited, Printed, Published & Owned by Mathangi Guruvaiah, and Printed at Spoorthi Publications, H.No.7-1059/1, Bangarugadda, Miryalaguda, Nalgonda District - Telangana, and Published at H.No.7-1059/1,Bangarugadda, Miryalaguda, Nalgonda District - Telangana. Editor : Mathangi Guruvaiah, Email : akshithadaily@gmail.com, Cell: 9000556444 RNI NO.APTEL/2011/37073